ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఫిబ్రవరి 08, 2015

అమ్మకే వైద్యం చేయాల్సి వస్తుందనుకోలా !

- డా|| పి. రఘురాం

విజేతలెవరు ?

అలీ జాఫర్

శ్రీదేవి

ఆర్ట్ ఎటాక్



సల్మాన్ ఖాన్

సినీ స్టార్లు ఎంత బిజీగా వుంటారో తెలీనిదేముంది! అంత మాత్రాన వాళ్లేం రోబోలు కాదు. నిరంతరం నటిస్తూ... డైలాగులు వల్లించడానికి. వాటిని మించి తమదైన ప్రపంచం.. తమవైన ఇష్టాయిష్టాలు, అభిరుచులు.. కూడా వుంటాయి. అరువు గొంతులు, కేశాలు, రంగులే కాదు! వారిలోనూ ఒరిజినాలిటీ వుంటుంది. చిత్రకళను ఇష్టపడే తారలు చాలా మందే వున్నారు. అరుదుగా లభించే ఖాళీ సమయాల్లో బొమ్మలు వేస్తూ పరవశించిపోతుంటారు.

వారిలో కండల వీరుడు సల్మాన్ ఖాన్ ముందు వరుసలో వుంటాడు. సల్లూ భాయ్ వేసిన బొమ్మలు ఆ మధ్య 2.5 కోట్ల రూపాయలకు అమ్ముడు పోయాయి. ఇక అతిలోక సుందరి శ్రీదేవి గీసిన చిత్రాలు అమ్మితే 22 లక్షల రూపాయలొచ్చాయి. హన్సిక మౌత్వాని తను వేసిన చిత్రాలను 15 లక్షల రూపాయలకు అమ్మింది. తాజాగా శ్రీయ పేరు వినిపిస్తోంది. ఈమె కూడా రాధాకృష్ణులు, శివుడు, ప్రకృతి దృశ్యాలు వేసి అమ్మకానికి పెట్టింది.

'ఇలాగైతే నిజమైన ఆర్టిస్టు బొమ్మలకు గిరాకీ పడిపోతుందేమో?' అన్న అనుమానం వచ్చేసినా ఆశ్చర్యం లేదు. పోలిక అని కాదు కానీ... ఓ పసివాడు గుర్రం బొమ్మ వేస్తాడు. తన ఆనందం కోసం. అలాగే ఎం.ఎఫ్.హుస్సేన్ కూడా వేస్తాడు. ఇందులో వుండే ఒడుపు, పట్టు, సృజనాత్మకత, వర్ణాల కలబోత...అందులో ఎందుకుంటుంది చెప్పండి! ఇదైనా అంతే. అభిమాన తారాగణం వేసిన చిత్రాలకు తాత్కాలికంగా గిరాకీ వున్నంత మాత్రాన... ఆర్టిస్టుల చిత్రాలేమీ చిన్నబోవు. వాటి స్థానం వాటిదే. వీటి స్టార్‌డమ్ వీటిదే. ●

హన్సిక

శ్రీయ

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

మొక్కుబడులు!

కొన్ని విషయాలు ఎప్పటికీ ఆశ్చర్యంగానే వుంటాయి. వాటిని ఎవరు.. ఎలా.. ఎందుకు.. కనిపెట్టారోనని సుదీర్ఘ ఆలోచనల్లో పడిపోతుంటాం. అలాంటి ఒకానొక అంశం 'మొక్కుబడి'. తొలి మానవులు అమ్మతల్లులకు మొక్కుకునేవారు. మాంచి వేట దొరికితే...పంట నిండుగా పండితే ... అందులో కొంత భాగం తల్లికి మొక్కు కింది చెల్లిస్తామని. బలులిస్తామని. ఆ వేడి రక్తం పంటనేల మీద పడితే ఇబ్బడి ముబ్బడిగా పంట చేతికొస్తుందని విశ్వసించేవారు. అప్పుడంటే రాతియుగం. అవన్నీ అనాగరికుల మొక్కులు.

ఇప్పుడు టిప్ టాప్‌గా టక్కేసుకునే వారూ... టెక్కీలూ అన్న బేధం లేకుండా అంతా మొక్కేస్తున్నారు. ఇవన్నీ నాగరికపు మొక్కులు. పిల్లలు లేని వాళ్లు.. పెళ్లి కాని ప్రసాదులు/పద్మలు.. ఉద్యోగార్థులు.. 'వీసా'వహులు, పదోన్నతులు ఆశించేవారు.. విద్యార్థులు... అంతా మొక్కులే మొక్కులు.

చూడాలే కానీ... ఇందులోనూ బిజినెస్సు సూత్రం ఒకటుంది. తమకు లేనిది...కావాలనుకునేది దొరికితే... ఎంతో కొంత పర్సెంటేజీ సమర్పించుకుంటాం అనుకుంటారు. కొందరైతే కేశాలు ఇచ్చేస్తారు (తిరిగి పెరుగుతాయి. నష్టం కూడా వుండదు). ఇంకొందరు ఏడు వారాల నగలు ఇచ్చేస్తారు. మరికొందరు నిలువు దోపిడీ ఇస్తారు. కట్టలు కట్టల డబ్బు హుండీలో పడేసి గమ్మున వెళ్లిపోతుంటారు. (మొక్కు డబ్బుకి, బంగారానికి టాక్సులు గట్రా గోల వుండదు కదా).

◆ మనలో మాట

ఆధునిక అవసరాలకు అనుగుణంగా మొక్కుకునేందుకు ప్రత్యేక దేవుళ్లు సృష్టించబడ్డారు. కాంట్రాక్టు దేవుళ్లు, యోగా దేవుళ్లు, వీసా గాడ్స్ వగైరా. వీసా కోరుకునేవారు... ఎక్కడెక్కడి నుంచో వచ్చి మరీ మొక్కేసుకుంటారు. వీసా కోరుకుంటూ... ఆలయాల్లో విమానపు బొమ్మలను సమర్పించుకునే వారూ వున్నారు (గుడి బయటే బొమ్మల షాపులుంటాయి లెండి. కొబ్బరికాయ, కర్పూరం, పూల మాదిరిగా ఏరోప్లేన్ బొమ్మ కూడా కొని ఇచ్చేయొచ్చు).

వీరందరికంటే స్ట్రిక్టు భక్తులు రాజకీయ నాయకులు. అధిష్టానం సీటు ఇవ్వాలని, ఎన్నికల్లో గెలుపొందాలని, ఆనక పదవి పొందాలని, ఆపైన అందినంత దోచేయాలని, వారసులకూ పదవులు రావాలని...అబ్బో ఇలా ఎన్నేసి కోరికలో! అవి తీరేందుకు వింత వింత మొక్కులు మొక్కేస్తుంటారు. ఆ జాబితా చెప్పకోవాలే కానీ చేంతాడంత అవుతుంది.

వీటన్నిటికన్నా ఎన్నికల్లో రాజకీయ నాయకుల ఆపద మొక్కులకు లెక్కే వుండదు. కొండకచో ఈ మొక్కులకు 'ఎన్నికల ప్రణాళికల'ని కూడా పేరుంది. ఓటరు దేవుళ్లకు నాయకులు మొక్కని మొక్కులు వుండవు. గెలవాలేగాని వారికి అన్ని రకాల మొక్కుబడులు ఠంచనుగా తీర్చుకుంటామని చెబుతారు. కానీ ఇతర మొక్కుబడులకూ ఎన్నికల మొక్కుబడులకూ ఓ చిన్న తేడా వుంది. దేవుడి మీద భక్తితోనో, భయంతోనో మొక్కుబడులు తీర్చేసుకుంటారు. కానీ ఎన్నికల మొక్కుబడులు మాత్రం ఎన్నటికీ తీర్చుకోరు. తీర్చలేరు. ఇంకో మాటలో చెప్పాలంటే ఎన్నటికీ తీర్చనివే ఎన్నికల మొక్కుబడులు. ■

టపా

చక్కగా చెప్పారు

నటులు, కవులు, సంగీత కళాకారులు ప్రజలను రంజింపజేసినపుడు వారికి కానుకలు యిచ్చి, తమ ఆనందం తీర్చుకోవడంలో ఒక ప్రత్యేకత ఉంది. 'మనలో మాట'లో కానుక అంటే తిరిగి ఇవ్వనవసరం లేదని అర్థం చెబుతూ, రాజకీయ నాయకులు పార్టీ నిధికి భారీ కానుకలు పుచ్చుకుంటారని చక్కగా చెప్పారు. దీపం కథలో ఎవరైనా, వారికిష్టమైన వృత్తి ఎన్నుకొన్నవారు మొదటి నుండి దానికి అనుకూలంగా చదువులు, నేర్పుతో వెళితే నైపుణ్యంతో ఆ వృత్తికి న్యాయం చేస్తారన్న అర్థాన్ని కథకుడు చూపించడం బాగుంది.

- ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారిపేట, విజయవాడ.

బాసటగా వుందాం

భారత రాజ్యాంగం ఆర్టికల్ 19 భావ ప్రకటనా స్వేచ్ఛ ఇచ్చింది. ఇది ప్రాథమిక హక్కు. కాని తమిళనాడుకు చెందిన ప్రొఫెసర్ మురుగన్ రాసిన 'మధోర్ బాగన్' నవలను కుల, మతోన్మాదులు ఇష్టపడలేదు. ప్రాథమిక హక్కులు కాపాడవలసిన పోలీసులు ఆయనను కుటుంబ సమేతంగా ఊరు వదిలి అజ్ఞాతంలోకి వెళ్లమన్నారు. 20 ఏళ్లుగా ఆచార్యులుగా వున్న మురుగన్ విద్యా విధానాన్ని దుయ్యబడుతూ అనేక వ్యాసాలు రాశారు. గతంలో కైలాసనాథ్ గుడిలో పిల్లల కోసం జరిగిన లైంగిక ఆచారం గురించి మురుగన్ తన నవలలో రాశారు. ఇటువంటి ఆచారాలు దేశంలో అనేక దేవాలయాల్లో వున్నాయి. ఇప్పటికీ దొంగ చాటుగా కొనసాగుతున్నాయి. సమాజిక జాఢ్యాల్ని ప్రశ్నించే రచనలు, చిత్రాలపై నిషేధం విధించిన మతఛాందస వాదుల చర్యలను అట్టమీది కథలో వివరించడం మంచి విషయం.

- టి.శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

దళారీలకు గుణపాఠం

జనవరి 25, స్నేహలో ప్రచురితమైన పాపం సుబ్బారావు కథ నేటి దళారీలకు గుణపాఠం. రంగుల పేజీల్లో వివిధ సందర్భాల్లో గూగుల్ వారు రూపొందించిన డూడుల్స్ గురించి చెప్పడం బాగుంది. వారు ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి కూడా సరికొత్త డూడుల్ రూపొందించారు. 'ఓ మై గాడ్, గోపాల గోపాల' చిత్రాలను విశ్లేషిస్తూ వచ్చిన కథనం ఆకస్తిగా అనిపించింది. ఆ చిత్రాలు ఎలాంటి సందేశాన్ని, అర్థాన్ని ప్రజలకు చెబుతుందో రచయిత చక్కగా వివరించారు.

జి. బాలాత్రిపుర సుందరి,
పెదనందిపాడు, గుంటూరు జిల్లా.

వాటిని నియంత్రించాలి

యువ శీర్షికలో యువత స్ఫూర్తి మంత్రం భగత్ సింగ్ ఆత్మహత్య పిరికివారి చర్య అంటూ సుఖదేవ్‌కు రాసిన లేఖను ప్రచురించడం బాగుంది. గొప్పవ్యక్తుల జీవితాలను యువతరానికి అందించడం నేడు చాలా అవసరం. జానపదంలో చండీ, రామిల ప్రేమ కథనం బాగుంది. మొదటి నుండి ఆసక్తిగా చదివించింది. చూద్దామాలో ఆంధ్ర కాశ్మీర్ లంబసింగి గురించి ఇచ్చారు. అక్కడ అక్రమార్కులు తిష్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వాటిని ప్రభుత్వం నియంత్రించాలి. అక్కడ ఉంటున్న గిరిజనులకు అక్కడే ఉపాధి మార్గాలు చూపించాలి. అప్పుడే ఆ ప్రాంత అందాలతో పాటు అక్కడ కొండ కోనల్లో నివసించే ప్రజల జీవితాలు అందంగా మారతాయి.

- కె. శోభన్ ,
హిందూపురం, అనంతపురం జిల్లా.

విడ్డూరం

రాజకీయ నాయకులు నోటికొచ్చినట్టు పిల్లల్ని కనమని బహిరంగ సభల్లో చెప్పడం విడ్డూరమన్న మాట బాగుంది. వారికి ఆ హక్కు లేదు. ఆడవాళ్లంటే పిల్లలను కనే యంత్రాలు కాదు అనేది వారికి తెలియాలి. విజన్ గురించి మాట్లాడేవారు కూడా ఎక్కువ మంది పిల్లల్ని కనండని చెప్పడం తిరోగమనానికి సంకేతం.

- కె. శ్రీలత, గుంటూరు

ఈ సంచికలో....

విజేతలెవరు?

కవర్‌స్టోరీ ———— 14

క్రికెట్... మూడక్షరాల ఆట మాత్రమే కాదు. మూడు రూపాల్లో బ్రిటీష్ పాలిత దేశాల క్రీడాభిమానులను సమ్మోహితులను చేస్తున్న క్రీడ. ఐదురోజుల సాంప్రదాయ టెస్ట్ క్రికెట్, ఒక్క రోజులో ముగిసిపోయే ఇన్‌స్టంట్ వన్డే క్రికెట్, మూడున్నర గంటల్లో అటో ఇటో తేలిపోయే ధూమ్ ధామ్ టీ-20 క్రికెట్... ఇలా మూడు రూపాలలోనూ అలరిస్తున్న ఈ జెంటిల్మన్ గేమ్‌లో 11వ వన్డే ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల సంయుక్త ఆధ్వర్యంలో రంగం సిద్ధమయ్యింది.

యువ 3
ప్రేమ అత్యంత మధురమైనది

కళ 4
కూచిపూడి నృత్య మానస

వింతలోకం 5
కాలివేళ్లతో నవలా రచన

కథ 6
రక్త సంబంధం

ప్రత్యేకం 8
అమ్మకే వైద్యం చేయాల్సి వస్తుందనుకోలా!

సినిమా కబుర్లు 10
సంచలన చిత్ర వజ్రోత్సవం 'రోజులు మారాయి'

సీరియల్ 18
ప్రేమ విప్లవం

సమ్‌థింగ్ స్పెషల్ 21
ప్లాస్టిక్ చెత్తబుట్టగా సముద్రాలు..

బాలనేస్తాలు 22
ముల్లంగి పాదం

కొత్త పుస్తకాలు 24
ఒక తరం స్వరం - సివి

చూద్దామా
కదిలించే కథనాలు
చలింప చేసే చిత్రాలు
.... 12

భగత్‌సింగ్

ప్రేమ అత్యంత మధురమైనది



సుఖదేవ్

ప్రాపంచిక విషయాల పట్ల విస్తృతమైన అవగాహన కలిగిన వ్యక్తి భగత్‌సింగ్. సామాజిక వ్యవస్థలను, వ్యక్తిత్వాలనూ అంచనా వేయగల అద్భుతమైన సామర్థ్యం అతని సొంతం. ఈ ప్రతిభకు కారణం ప్రపంచ శాస్త్రవేత్తలు, తత్వవేత్తల పుస్తకాలు చదవడం. వాటిని సరైన పంథాలో అర్ధం చేసుకొని, ఆచరించడం. ఇవన్నీ భగత్‌ను చిన్నవయస్సులోనే ప్రతిభాశీలిని చేశాయి. నేటికీ జనం గుండెల్లో చిరంజీవిగా మిగిల్చాయి. సుఖదేవ్ ఆవేశపరుడని పేరు. ఒక సమావేశానికి వచ్చిన యువతితో భగత్ ప్రేమలో పడ్డాడని అతని అనుమానం. ఆ నేపథ్యంలో సుఖదేవ్‌కు ఒక ఉత్తరం రాస్తూ అందులో ప్రేమ గురించి భగత్ వివరించిన తీరు చూస్తే సమాజంపట్ల అతనికున్న ప్రేమ, నిజమైన ప్రేమకు ఆయనిచ్చిన నిర్వచనం అర్థమవుతాయి. ఆ లేఖలోని సారాంశం ఇది!

ప్రియ సోదరా!

ఈ క్షణం వరకూ ఒక విషయం నన్ను వదలకుండా తీవ్రఘర్షణకు గురిచేస్తోంది. నా సోదరుడూ, అక్షరాలా నా స్నేహితుడే నన్ను అపార్థం చేసుకుని నాలో బలహీనత ఉందని ఆరోపించడం . కాని ఈ రోజు నాకెంతో సంతృప్తిగా ఉంది. అది కేవలం అపార్థం మాత్రమేనని, పొరబాటు అంచనా తప్ప మరేమీ కాదని నేను గట్టిగా భావిస్తున్నాను. నేను మరీ ముక్కుసూటిగా మాట్లాడ్డం వల్ల వదరుబోతునని అనుకున్నావు. కొన్ని విషయాల్లో నా ఒప్పుకోళ్లను బట్టి బలహీనుణ్ని అనుకున్నావు. కాని నీ అంచనా సరైంది కాదని, అది కేవలం అపార్థం మాత్రమేనని నాలో బలహీనతేం లేదని, మన దళంలో ఎవరికన్నా నేను బలహీనుణ్ని కానని గట్టిగా అనుకుంటున్నాను.

నా మనసు నిండా ఆశలు, ఆశాభావాలు, జీవితానందమూ తొణకిసలాడుతున్నాయి. అవసరం వచ్చినపుడు వాటన్నింటినీ పరిత్యజించడానికి సంసిద్ధంగా ఉంటాను. మనిషి నిజంగా మనిషైతే ఇలాంటివి కార్యాచరణకు అడ్డురావు. ఈ విషయం నీకు త్వరలోనే రుజువవుతుంది. ఎవరైనా వ్యక్తి ప్రవర్తనను గురించి మాట్లాడేప్పుడు ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. ఎన్నడైనా ఏ వ్యక్తికైనా ప్రేమ సాయపడిందా? అని నీవు అడిగావు. ఈనాడు ఆ ప్రశ్నకి జవాబు చెబుతున్నాను. ప్రేమ సహాయకారి అయింది, మెజనీ విషయంలో. నువ్వు కూడా చదివే ఉంటావు అతని గురించి. తాను ప్రారంభించిన తొలి తిరుగుబాటు ఘోరంగా విఫలమైంది. ఆ దారుణ పరాజయం, పోరాటంలో నేలకొరిగిన సహచరుల జ్ఞాపకాలు అతన్ని వదలకుండా వెంటాడాయి. జీవితమే దుర్భరమనిపించింది. ఉన్మాది కావడమో ఆత్మహత్య చేసుకోవడమో తప్ప గత్యంతరం లేనట్టనిపించింది. సరిగ్గా ఆ సమయంలో ప్రియురాలి లేఖ అతన్ని ఆ పరిస్థితి నుండి బయట పడవేసింది. అతను బలం పుంజుకున్నాడు.

ప్రేమలో నైతిక స్థాయి విషయం . అది ఉద్రేకం తప్ప మరేమీ కాదు. అది జంతు ప్రవృత్తి అనను. అది మానవీయమైంది. అత్యంత మధురమైంది కూడా. ప్రేమ ఎన్నడూ స్వతహాగా జంతు ప్రవృత్తి కాదు. అది మనిషి వ్యక్తిత్వాన్ని ఉన్నతీకరిస్తుందే తప్ప దిగజార్చదు. అయితే ఆ ప్రేమ నిజమైనదై ఉండాలి. మనం సినిమాల్లో చూసినట్టుగా ప్రేమలో పడిన అమ్మాయిలను పిచ్చివాళ్లని అనలేం. సినిమాల్లో అమ్మాయిలు జంతు ప్రవృత్తికి బలవుతుంటారు. నిజమైన ప్రేమను ఎవరూ సృష్టించలేరు. దానంతటదే వస్తుంది. ఎప్పుడొస్తుందో కూడా ఎవరూ చెప్పలేరు. అది సహజంగా ఉంటుంది. ఓ యువతీ, యువకుడూ పరస్పరం ప్రేమించుకోగలిగితే దాని సహాయంతో వారే ఆవేశపు స్థాయిని అధిగమించి విశుద్ధతను కాపాడుకోగలుగుతారు. ఇక్కడే నేను ఒక విషయం స్పష్టం చేయాలి. ప్రేమ మానవుల బలహీనత అన్న వ్యాఖ్య మామూలు మనుషులకు వర్తించేది కాదు. అంతకంటే ఆదర్శస్థాయిని చేరి మనోభావాలను అదుపు చేసుకోగలిగిన వారి గురించి. రాగద్వేషాల్ని అదుపు చేసుకుని కేవలం హేతుబద్ధంగా కార్యాచరణ సంకల్పించిన వారి గురించి... కాని ప్రస్తుత దశలో ఇది తప్పు కాదు. అంతేకాక మంచి చేస్తుంది. ప్రయోజనకరమైంది కూడా. నేను ఒకానొక భావాత్మక దశలో మనిషిని మనిషి ప్రేమించడాన్ని కొట్టిపారేశాను. ఆ దశలో కూడా ప్రేమ భావన ఎవరో ఒకరికే మనిషి వరకే పరిమితం చేయకూడదని, విశ్వజనీనం కావాలని అనుకున్నాను. కాని ఇప్పుడు నా అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పాననుకుంటున్నాను. ఒకటి మాత్రం బాగా దృష్టిలో పెట్టుకోవాలి. సమస్త విప్లవ భావాలు వున్నాయనుకునే మనం నైతిక దృష్టి విషయంలో ఏ ఆర్యసమాజం వాళ్లలాగే అమితాదర్శపు భావవాదంలో ఉండిపోయాం. వాగాడంబరంతో తిమ్మిని బమ్మిని చేయవచ్చు. కాని వాస్తవ జీవితంలో మాత్రం తలకిందులై పోతాం. అలాంటి దాన్నే వదులుకోవాలని నేను నిన్ను కోరుతున్నాను.

నా వరకు వస్తే నా భావన పొరబాటేమోనన్న భయాన్నంతటినీ పక్కనపెట్టి ఒక్క ముక్క చెప్పదలచాను. నీ శ్రుతిమించిన ఆదర్శ వాదం తగ్గించుకోవాలి. నీ కంటే వెనకబడిన వాళ్లతో మరీ కఠినంగా ఉండొద్దు. తీవ్రంగా విరుచుకుపడి వాళ్ల బాధావేదనలను పెంచకు. వారికి నీ సానుభూతి చాలా అవసరం. నేను ఈ విషయమే మరోసారి చెబుతాను. ఎవరిపైన కోపం పెట్టుకోకుండా సానుభూతి చూపిస్తావా? అలాంటి పరిస్థితి నీకు ఎదురైతేనే తప్ప ఆ అవసరం అర్థం కాదు. నిర్మొహమాటంగా అరమరికలు లేకుండా విషయాలు నీకు తేటతెల్లం చేయాలనే ఇదంతా రాశాను. ఇప్పుడు మనసు చాలా తేలికై పోయింది.

నీకు విజయం కలగాలని, సంతోషం లభించాలని కోరుతూ........

మీ

భగత్‌సింగ్

◆ కళ

మనిషి వ్యక్తిత్వం పరిఢవిల్లడానికి శాస్త్రీయ కళలు ఏంతో దోహదపడతాయి. ఆత్మ స్థైర్యాన్ని నింపుతాయి. మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి. అలాంటి కళలు నేర్చుకోవడం నేడు ఖర్చుతో కూడుకున్నపని. సామాన్యులకైతే కళలు నేర్చుకోవడం అన్నది కలగా మాత్రమే మిగిలిన పరిస్థితి. ఈ పరిస్థితి మారాలి. తెలుగువారి నృత్యం కూచిపూడి పామరులకు సైతం చేరువ కావాలి. ఈ సంకల్పంతో 'కూచిపూడి మై లైఫ్' పేరిట తను నేర్చుకున్న విద్యను పదిమందికి పంచుతున్నారు ఈ యువ నాట్య మయూరి అచ్యుత మానస.

కూచిపూడి నృత్య 'మానస'

మానస తండ్రి ఐ.పిఎస్ అధికారి, ఆయన పేరు రవిచంద్ర. ఉద్యోగ రీత్యా వారు గుంటూరులో ఉంటున్నప్పుడు 2010, ఆగస్టు 15 పెరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న కార్యక్రమానికి ఆమె వెళ్లారు. ఆ వేదికపై ప్రభుత్వ వసతి గృహంలోని కొంత మంది పిల్లలు ఏ.ఆర్.రెహమాన్ స్వరపరిచిన 'వందేమాతరం' పాటకు నృత్యం చేశారు. పిల్లలకు ఏది నేర్పిస్తే అదే నేర్చుకుంటారు. వారికి అర్థంపర్థంలేని సినిమా పాటల కన్నా కూచిపూడి నృత్యం నేర్పిస్తే బాగుంటుంది అనే ఆలోచన మానస మదిలో మెదిలింది అప్పుడు. మరుసటి రోజే తన ఆలోచనను ఆచరణలో పెట్టారు. ఆరు నెలల పాటు సాగింది శిక్షణ. "జనవరి 26 గణతంత్ర దినోత్సవం వేడుకలకు నృత్య ప్రదర్శన ఇవ్వాలి. ఏ పాట ఎంచుకుంటారు అనిఅడిగాను పిల్లల్ని. 'చంద్రముఖి'లో పాటకు చేస్తామన్నారు. మనస్సు చివుక్కుమంది. మన సినిమాల్లో చూపించే నృత్యాలు పూర్తి శాస్త్రీయ నృత్యాలు కావని చెప్పాను. బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరానికి నృత్య రూపకం ప్రదర్శిద్దామన్నాను. అందుకు వారూ అంగీకరించారు. వేదికపై పిల్లల ప్రదర్శన చూసి నేనే ఆశ్చర్యపోయా! అంత బాగా చేసారు".

అవన్నీ దిగదుడుపులే

తండ్రి ఉద్యోగరీత్యా మానస కుటుంబం మొత్తం హైదరాబాద్‌కు మారాల్సొచ్చింది.

అక్కడ కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని పిల్లలకు డాన్స్ నేర్పించాలనుకున్నారు. అక్కడికెళ్లి పిల్లలతో పరిచయం పెంచుకున్నారు. నృత్య శిక్షణ ప్రారంభమైంది. మొదటి క్లాసుకు అరవై మంది పిల్లలు వచ్చారు. రెండోరోజు సగానికి సగం మంది ఆసక్తి చూపలేదు. వారిలో కొంత మంది చిత్రలేఖనం నేర్చుకుంటామన్నారు. ఆసక్తిగల పిల్లలకు కూచిపూడితో పాటు చిత్రలేఖనం కూడా నేర్పించేవారు. "స్టేట్ హోమ్ పిల్లలతో నా ప్రయాణం మొదలై మూడేళ్లవుతుంది. మొదట్లో కొంత మంది పిల్లలు బద్దకంగా, మరికొంత మంది క్రమశిక్షణ లేకుండా ఉండేవారు. నాతో కూడా రూడ్‌గా మాట్లాడేవారు. పాపం వాళ్లకు నాఅన్నవారు లేరు. మంచి చెడ్డలు చెప్పేదెవరు అనుకొని సర్దుకుపోయేదాన్ని. వారితో స్నేహం మరింత పెరిగింది. మెల్లిగా వారి ప్రవర్తనలో కూడా మార్పు మొదలైంది. ఇప్పుడు అనిపిస్తుంది, అసలు ఈ పిల్లలు ఆ పిల్లలేనేనా అని. చాలా క్రమశిక్షణగా తయారయ్యారు. ఇప్పుడు ఆ పిల్లలు రవీంద్రభారతి వంటి పెద్ద వేదికలపై ఎన్నో నృత్య ప్రదర్శనలిస్తున్నారు. వారిలో శాంతిశ్రీ అనే అమ్మాయి 2013లో రాష్ట్ర ప్రభుత్వం నుండి చిత్రలేఖనంలో బాలరత్న అవార్డు కూడా అందుకుంది. నాకు యునెస్కో వాళ్ల మిలీనియమ్ బెస్ట్ కల్చరల్ అంబాసిడర్ అవార్డు ఇచ్చారు. నాట్య మయూరి, నాట్య స్రవంతి వంటి జాతీయ అవార్డులు అందుకున్నాను. కాని శాంతిశ్రీ బాలరత్న అవార్డు తీసుకుంటున్నప్పుడు నాకు కలిగిన ఆనందం ముందు అవన్నీ దిగదుడుపులనిపించాయి".

కార్పొరేట్ కొలువు కాదనుకొని

అచ్యుత మానస ఐదో ఏట నుండే కూచిపూడి నృత్యం నేర్చుకోడం ప్రారంభించారు. కూచిపూడితోపాటు, భరత నాట్యం, కథక్, మోహినీ అట్టం, ప్రేంకిణి(నాట్యం చేస్తూ కాలి వేళ్లతో బొమ్మ వేయడం) వంటి నృత్య రీతుల్లో సుమారు ఎనిమిది వందల పైచిలుకు ప్రదర్శనలిచ్చారు. కూచిపూడిలో ఎమ్.ఏతో పాటు ఇంజినీరింగ్ విద్యనూ అభ్యసించారు. చదువు, జ్ఞానం వేర్వేరు. చదువు ఎవరైనా నేర్పిస్తారు. జ్ఞానం కళల ద్వారా మాత్రమే అబ్బుతుందని మానస అభిప్రాయం. కళలను ప్రజలకు చేరువ చేసేందుకు కార్పొరేట్ కంపెనీలో లక్షల జీతం వచ్చే కొలువునూ వదిలేసారు. కూచిపూడి నేర్చుకోవాలనుకుంటున్న వారికి ఉపకరించే విధంగా తన గురువుగారైన శ్రీ కాజా సుబ్రహ్మణ్యం గారి నృత్య దర్శకత్వంలో 'కూచిపూడి నృత్యాభినయ వేదం మోక్షమార్గం' అనే డీవీడీని అందుబాటులోకి తేబోతున్నారు. "ఇప్పుడు నృత్యం నేర్చుకోవడానికి చాలా ఖర్చు అవుతుంది. గ్రామాల్లో ఉన్న వారు నేర్చుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం సాహిత్యాన్ని, కళలను చిన్న చిన్న పల్లెల్లోని పాఠశాలలకు సైతం తీసుకెళ్లగలగాలి. అప్పుడు మాత్రమే సాంస్కృతిక చైతన్యం పరిఢవిల్లుతుంది. జన జీవనంలో మార్పు వస్తుంది" అంటారు ఈ యువ కళా స్రవంతి. కొద్దిరోజుల క్రితమే మానస కుటుంబం వైజాగ్ మారారు. అయినా స్టేట్‌హోం పిల్లలకు నృత్యం నేర్పిస్తున్నారు. అంత దూరాన ఉండి ఎలాగంటారా "ఆన్‌లైన్ ద్వారా". అంతేకాదు ఇవన్నీ చేస్తూ సివిల్స్‌కు కూడా సిద్ధమవుతున్నారు. సమయం సరిపోతుందా అని అడిగితే...మనం రోజులో తెలియకుండా చాలా సమయాన్ని వృధ్దా చేస్తాం. నేను నా సమయాన్ని ఖచ్చితత్వంతో ప్రణాళికా బద్ధంగా ఉపయోగించుకుంటా నంటున్నారు అచ్యుత మానస.

- గన్నవరపు రిషిత

◆ వింతలోకం



కాలివేళ్లతో నవలా రచన

నవలలు, కథలు, కవితలు రాయడంలో పెద్ద ప్రత్యేకత ఏమీ లేదు. కాకపోతే కాలివేళ్లతో రాయడమే ఇక్కడ కొత్తదనం. అలా వార్తలకెక్కింది ఎవరో కాదు. చైనా యువతి హు హుయువాన్. ఈమెకు పసితనంలోనే సెరిబ్రల్ పాల్సీ (మస్తిష్క పక్షవాతం) సోకింది. దాంతో ఆమె శరీరం తన స్వాధీనంలో వుండదు. కొద్దిగా కాలి వేళ్లే ఆమె మాట వింటాయి. ఇక వాటితోనే తన దైనందిన కార్యక్రమాలు పూర్తి చేసుకుంటూ వుంటుంది. తన జీవితాన్నే నవలగా రాస్తోంది. అది కూడా దాదాపు ఆరు అధ్యాయాలు పూర్తయింది. మరో విశేషం ఏమంటే ... తన వైకల్యం కారణంగా అందరిలా స్కూలుకు వెళ్లగలిగేది కాదు. టీవీలో, సినిమాల్లో వచ్చే మాటలు, స్క్రోలింగులు చూసి అక్షరాలు చదవడం, రాయడం నేర్చుకుంది. అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుకు బాగా ఉపయోగపడిందన్నది హుయువాన్ మాట. తల్లిదండ్రులు ఆమెను చూసి ఎంతగా గర్వపడుతున్నారనేది మాటల్లో చెప్పలేం. ఎందుకంటే పసికందుగా వున్నప్పుడు ఆమెకు వైద్యం చేసిన డాక్టర్లు... తమ వల్ల కాదని... ఎక్కువ కాలం బతకదని... చెప్పేశారు. అలాంటి పిల్ల ఇవాళ్ల పెరిగి పెద్దదై... నవల రాసే స్థాయికి ఎదగడం గర్వకారణమే కదా మరి. అయితే కీ బోర్డు మీద కాలి వేళ్లతో టైపు చేయడం చూడ్డానికి...చెప్పుకోడానికి గొప్పగా అనిపిస్తున్నా... అది చేయడం ఎంత కష్టమో చేస్తేనే తెలుస్తుంది.

ఖైదీలు కూరగాయలు పండించడం, పచ్చళ్ల మొదలుకొని చెక్క సామాన్ల వరకు తయారు చేయడం గురించి కథనాలు చదువుతుంటాం పత్రికల్లో. అంతెందుకు ఖైదీలే నడిపే హోటళ్లు, రెస్టారెంట్ల గురించి కూడా వింటుంటాం. ఇప్పుడు మనం చెప్పుకోబోయేది సరిగ్గా అలాంటిదే. ఆ రెస్టారెంట్ పేరు 'ది క్లింక్'. వేల్స్ లో వుంది. స్థానిక

ఖైదీలు నడిపే హోటల్

పురుషుల జైలుకు చెందిన ముప్పై మంది ఖైదీలు ఇందులో పని చేస్తున్నారు. వారానికి నలభై గంటలు పనిచేస్తారు. నిజానికి దీనిని రెండేళ్ల కిందటే ప్రారంభించారు. నగరంలోని వెయ్యి రెస్టారెంట్లలో దీనికి మంచి పేరు వుంది. రుచి, శుచి ఎందులోనైనా ఇదే బెస్టట. ఖైదీలు ఎంతో నిజాయితీతో కష్టించి పనిచేస్తారని కస్టమర్ల అభినందనలు కురిపిస్తున్నారు. ఇదంతా చదువుతుంటే తీహార్ ఖైదీలు నడుపుతున్న రెస్టారెంట్ గుర్తొచ్చిందా!

✦

అందంగా కనిపించాలని, నిత్య యవ్వనంగా వుండాలని కోరుకునేవారికేం కొదవలేదు. అలా అనుకునేవారు మన చుట్టూ వున్నారు. మనలోనూ వున్నారు. ఇప్పటి

నత్తల మసాజ్

వరకు ఎన్నో రకాల మసాజ్‌ల గురించి విని వుంటాం. చదివి వుంటాం. చేయించుకుని కూడా వుంటాం. ఇదిగో ఇప్పుడు నత్తల మసాజ్ వచ్చింది. థాయ్‌లాండ్‌లో లెండి! ఒక్కసారి మసాజ్ చేయించుకోవాలంటే 30 డాలర్లు చెల్లించాలి. అదీ మొహం మీద మాత్రమే చేయడానికి. అవి మెల్లగా అటూ ఇటూ కదులుతూ ఒకరకమైన స్రవాలను వదులుతాయి. దాని ప్రభావం వెను వెంటనే కనిపించకపోయినా...నెమ్మదిగా వుంటుందట. మొటిమలు, ముడతలు, మచ్చలు ... కూడా పోతాయని చెప్తున్నారు. మొహంలో యవ్వనం, తాజాదనం కనిపిస్తుందట. దాంతో కస్టమర్ల రద్దీ బాగా పెరగడంతో బ్యూటీ పార్లర్ల నిర్వాహకులు కూడా సంతోషిస్తున్నారు.

రక్తసంబంధం



◆ కథ

పి.ఎల్.ఎన్.మంగారత్నం
9701426788

ఆ రోజు సుబ్బరాజు ఇల్లంతా సందడిగా వుంది. అందుకు కారణం ఆ ఇంటి మహాలక్ష్మి.. ఒక్కగానొక్క గారాల పట్టి.. ముద్దుల కూతురు సత్యవతి ఐదవ పుట్టినరోజు. పట్టులంగా వేసుకుని, కాళ్ళ పట్టీలు ఘల్లుఘల్లుమంటూ తిరుగుతుంటే, ఇంట్లో అందరు మురిపెంగా చూసుకుని మురిసిపోతున్నారు. ఇద్దరబ్బాయిల తరువాత పుట్టిందేమో మరీ అపురూపం.

మరోకారణం చాలా రోజులకి పట్నంలో వున్న చెల్లెలు సరస్వతి, బావమరిది ధనుంజయ్ రాక. బుట్టబొమ్మలా తిరుగుతున్న మేనకోడల్ని చూస్తే సరస్వతికి మనసులో మెదిలిన ఆలోచన పైకి చెబుదామంటే ధైర్యం చాలలేదు. భర్త ఏమైనా అంటాడేమోనని.

“సత్యవతి చాలా ముద్దుగా వుంది కదండీ. మా అమ్మ పేరే పెట్టినందుకు అచ్చు మా అమ్మాలానే వుంది”. అంది పిల్లని దగ్గరకు తీసుకుంటూ.

“ఊ”.. అవునన్నట్లు తలాడించాడు ధనుంజయ్.

కొడుకు రాకేష్‌తో కలిసి ఆడుకుంటుంటే పిల్లలిద్దరూ చూడముచ్చటగా వున్నారు. సుబ్బరాజు బావమరిదికి ఇష్టమైన నాటు కోడి కూర, చేపల పులుసు ఇంకా పిండివంటలు చేయించే ప్రయత్నంలో వున్నాడు.

‘దూరాన ఉన్న సరస్వతి వచ్చిందేమో’.. ఊళ్ళో వాళ్ళందరూ పనిగట్టుకుని వచ్చి పలకరిస్తున్నారు. వచ్చిన పెద్ద తలకాయలు ఊరికినే ఉంటారా! “ఏరా! సుబ్బరాజు పిల్లలిద్దరూ చూడు ఎంత చూడముచ్చటగా వున్నారో! ఏరోజు ఎలా ఉంటుందో? ఇప్పుడే ఓ మాటనుకుంటే పోలేదు. బయటి సంబంధాలు చూసుకోవడం ఎందుకు? ఆస్తులు బయటకు పోవడం తప్పించి” అంది అత్తయ్య వరసైన ఓ పెద్దావిడ.

“అవును. నిజమే” వంత పాడారు మిగిలిన పెద్దతలకాయలు.

‘ఈ ఆలోచనని ఆయనతో ఎలా చెప్పాలో తెలియక అవస్థ పడుతున్న తరుణంలో సుబ్బమ్మ అత్తయ్య బాగానే కదిపింది’ అనుకుంది మనసులో సరస్వతి.

వదినకు వంటలో సహాయం చేస్తూనే, ఓ చెవి ఇటు పడేసింది. అక్కడున్న ఆడవాళ్లు వంటల్లో.. తలో చెయ్యి వేస్తుంటే. గాడి పొయ్యి మీద వంటలు సాగిపోతున్నాయి.

ఊహించని పరిణామానికి సుబ్బరాజు ముందు ఆశ్చర్యపోయినా.. తరువాత సందిగ్ధంగా... ధనుంజయ్ వైపు చూస్తూ

“నాదేముంది సుబ్బమ్మ అత్తా! బావగారికి ఇష్టమైతే.. నాకు అభ్యంతరం ఏమిటి?. పల్లెటూళ్లో వుండే వాళ్ళం... మన పిల్ల పట్నంలో ఉంటుందంటే సంతోషమే కదా” అన్నాడు నసుగుతూ.

ధనుంజయ్‌కి కూడా ఒక్క నిముషం ఏం మాట్లాడాలో తోచలేదు. ముసలమ్మ ఇరకాటంలో పెట్టేసింది అనుకుంటూ... సరస్వతి వైపు చూసాడు, ఆమె నాడి తెలుసుకోవాలన్నట్లు.

పుట్టింటి సంబంధం ఏ ఆడపిల్ల కాదంటుంది. ‘తనకిస్టమే’ అన్నట్టు తలూపింది.

సుబ్బరాజుకూ ఆస్తులకు లోటు లేదు. పిల్లా ముద్దుగా... బొద్దుగా చక్కటి కనుముక్కు తీరుతో బాగుంది. కాదనడానికి కారణం ఏదీ కనిపించలేదు ధనుంజయ్‌కి. “సరే! అలాగే” అంగీకారం తెలిపాడు.

తన కూతురికి అపుడే సంబంధం కుదిరి పోయినందుకు సబ్బరాజు చాలా సంతోషించాడు.

అందరి పెద్దల సమక్షంలో నిర్ణయం జరిగిపోయింది.

అందుకు గుర్తుగా...

ఆ సాయంత్రం ఫొటోగ్రాఫర్ వచ్చి ఫొటోలు తీసాడు. ఐదేళ్ళ సత్యవతిని.. ఎనిమిదేళ్ళ రాకేష్‌ని చిటికెన వేలు పట్టించి. అప్పుడే సగం పెళ్ళయిపోయినట్లు.

ఇద్దరికీ ఆ ఫొటో అర్థం ఏమిటో తెలియని వయస్సు. రెండు ఫొటోలు వరండాలో గోడకు పెట్టించారు.

ఈ విషయం.. పక్క ఊళ్ళోనే వున్న సుబ్బరాజు అక్క అనసూయకు వాళ్ళ ద్వారా వీళ్ళ ద్వారా తెలియడంతో చాలా బాధపడింది. తమ్ముడు తనకు తెలియకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం మింగుడు పడడం లేదు ఆమెకు.

◆ ◆ ◆

నాలుగు రోజుల తరువాత.. చెల్లెల్ని, బావమరిదిని రైలు ఎక్కించి, నేరుగా అక్క గారింటికి వెళ్ళాడు. అక్కకి చెప్పకుండా ఏ పని చెయ్యడు. అక్కే అన్నిటికి ముందుండాలి. అలాంటిది ఇప్పుడు అక్కకి చెప్పే సమయం చిక్కలేదు.

చెల్లెలు వచ్చిందని తెలిసిన రోజే... తమ్ముడింటికి వచ్చి సరస్వతిని చూసి వెళ్లి పోయింది అనసూయ. “పొలంలో కోతలున్నాయి” అంటూ. ఇంతలోనే ఇలా జరుగుతుందని అనుకోలేదు.

సంతోషంగా విషయం చెప్పబోతున్న సుబ్బరాజుకి.. చుక్కెదురైంది.

“చిన్నప్పటినుంచి.. దాన్ని నా రెండో కొడుక్కి చేసుకోవాలనుకున్నాను. నా రక్తసంబంధాన్ని దూరం చేసుకోకూడదు అనుకున్నాను. పట్నంలో ఉంటున్నారు కదా, అందుకని వాళ్ల సంబంధం కలుపుకుంటున్నావా? కళ్ళ ముందున్న నా కొడుకు.. నీకు చేదైపోయాడు”.

బాధ పడింది.

అక్కకి ఈ ఆలోచన వున్నట్లు అనిపించినా... ఆ రోజు అనుకోకుండా అలా జరిగిపోయింది. కక్కొచ్చినా...కళ్యాణమొచ్చినా ఆగదంటారు మరి.

పొలం పనులంటే ఇష్టపడే రైతు బిడ్డ సూర్యం కన్నా, పట్నంలో చదువుకుంటూ దొరబాబులా వున్న రాకేష్ నిజంగానే నచ్చాడు. అక్కతో ఎక్కువ వాదనలు పెట్టుకోదలచుకోలేదు సుబ్బరాజు.

◆ ◆ ◆

ఏళ్ళు గడుస్తున్నాయి. పట్నంలో రాకేష్ చదువు అంతంతమాత్రంగా సాగుతోంది.

పదవ తరగతి.. ఏదో అయిందనిపించాడు. తెచ్చుకున్న అత్తెసరు మార్కులకి ఇంటర్మీడియట్‌లో సిటీలో కాకుండా, ఊరికి.. బాగా దూరంగా వున్న కాలేజీలో సీటు వచ్చింది. అక్కడే అతని లైఫ్ అనుకోని మలుపు తిరిగింది.

ఇంట్లో పాకెట్టు మనీతోపాటు బస్సు ఛార్జీలకు.. ఇతర అవసరాలకి బాగానే డబ్బులిచ్చేవారు. ఇంటికి ఒక్కగానొక్క కొడుకు. దేనికీ కష్టపడకూడదు అనుకునేవాడు ధనుంజయ్. చిన్నదైనా ఆడపిల్ల సువర్చలతో అంత ఇబ్బంది లేదు.

డబ్బులు చేతిలో దండిగా వుండే సరికి కొత్త స్నేహితులు పుట్టుకొచ్చారు. సినిమాల పిచ్చి పట్టుకుంది. ఇన్నాళ్ళు తల్లిదండ్రుల భయంతో నెలకు ఒకటి.. రెండు చూసినా.. ఇపుడు కాలేజీకి దగ్గరలోనే సినిమాహాలు. అడ్డుపెట్టే వాళ్ళు లేరు. పైగా తోడొచ్చే స్నేహితులు. ఆడింది ఆట.. పాడింది పాట.

అప్పుడప్పుడు ఇంట్లో డబ్బులు మాయమవడం.. ఫోన్‌లో స్నేహితులతో... సినిమాలు, షికార్ల గురించే మాట్లాడటం. సరస్వతిలో అనుమానాలు రేకెత్తించాయి.

ఓసారి "అమ్మా! నిన్న రిలీజు అయిన 'మహేష్‌బాబు' సినిమా అపుడే చూసేసాడట.. అన్నయ్య. పైగా ఎల్లుండి నుంచి పరీక్షలు. అయినా పుస్తకాలు తియ్యడం లేదు. కంప్యూటర్ గేమ్స్ ఆడుతున్నాడు" అంటూ ఫిర్యాదు చేసింది సువర్చల.

ఆ మాటకి సరస్వతి గట్టిగా నిలదీయడంతో... "కాలేజీలో లెక్చరర్లు సరిగా లేరని, రోజులో అన్ని పిరియడ్లు జరగవని, ఎప్పుడైనా క్లాసులు జరగవనుకుంటే... ఫ్రెండ్స్‌తో కలసి వెళ్లి ఒక 'షో' చూసివస్తామని ఒప్పుకున్నాడు.

"శ్రద్ధగా చదివి మంచి మార్కులు తెచ్చుకో. లేకపోతే ఇంజనీరింగ్‌లో సీటు రాదు." అంటూ హితవు పలికింది.

ఇంటరు ఫస్ట్ ఇయర్లో మూడు సబ్జెక్టులు 'ఫెయిల్' అవడంతో కొడుకు పరిస్థితి తెలిసి వచ్చింది ధనుంజయ్‌కి. వెంటనే మంచి ట్యూషన్ సెంటర్లో జాయిన్ చేశాడు.

ట్యూషన్‌కి వెళ్ళడం, కాలేజీ అయిపోయిన తరువాత మళ్లీ ట్యూషన్‌కి వెళ్ళడం చాలా కష్టంగా తోచేవి రాకేష్‌కి. బాడీ ప్రజెంట్.. మైండ్ సినిమాల మీద ఉండటంతో షరా.. మామూలే. అనుకున్న ఫలితం రాలేదు. సెకండ్ ఇయరూ 'ఫెయిలే'.

రిక్షా తొక్కుకునే వాళ్ళ పిల్లలు... పూట గడవని వాళ్ళ పిల్లలు చక్కగా చదువుకుని పైకొస్తుంటే.. దేనికీ లోటు లేని ఇంట్లో పుట్టి పెరిగిన పిల్లవాడికి చదువబ్బకపోవడం ధనుంజయ్‌ని ఆవేదనకు గురిచేసింది.

సరస్వతి పరిస్థితి అలానే వుంది. కొడుకుని గురించి అన్నయ్య తరుచూ అడుగుతుంటే.. సమాధానం చెప్పలేకపోతుంది. మళ్ళీ 'ఫెయిల్' అయ్యాడని ఎలా చెప్పాలో తెలియక సతమతమవుతోంది.

◆ ◆ ◆

సత్యవతికి యుక్త వయస్సు వచ్చేసరికి.. రాకేష్ పరిస్థితి చెయ్యి దాటిపోయింది. తన తోటివాళ్ళు ముందుకెళ్ళిపోగా.. తను ఉన్న చోటునే ఉండిపోయాడు.

సుబ్బరాజు పరిస్థితుల్ని పూర్తిగా అవగాహన చేసుకున్నాడు.

'సరస్వతి ఏమనుకున్నా సరే! తన కూతుర్ని, రాకేష్‌కి ఇవ్వదలుచుకోలేదు'. ఆ మాటే అక్కతో అన్నాడు. అడగబోయిన తీర్థం ఎదురయ్యింది అనసూయకి.

"సూర్యం మస్కట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. బాగా చదువుకున్నాడు. బాగానే సంపాదిస్తున్నాడు. నీ కూతుర్ని నా ఇంటికి తెచ్చుకోవాలని, నేను ఎప్పుడో అనుకున్నాను. నువ్వే దూరం అయిపోయావు. కాదనుకుంటే బయటి సంబంధాలు చూసుకో" చెప్పింది అనసూయ.

'అందం, చదువుతో పాటు, సంస్కారం బాధ్యతలు తెలిసిన సూర్యమే తన కూతురికి తగినవాడని' నిర్ధారించుకున్నాడు సుబ్బరాజు.

ఆరు నెలల తరువాత మస్కట్ నుంచి వచ్చాడు సూర్యం. ఆలస్యం చెయ్యలేదు. అమ్మాయిని, అబ్బాయిని అభిప్రాయాలు అడిగారు. ఇద్దరూ పెద్దలకే తమ ఇష్టాన్ని వదిలేశారు. సూర్యానికున్న రెండు నెలల సెలవును సద్వినియోగం చేసుకునేలా.. ముహూర్తాలు పెట్టించి శుభలేఖలు పంచారు. మధ్యవర్తిత్వం నడిపిన... సుబ్బమ్మ అత్త ఇప్పుడు లేకపోయినా.. ఎవ్వరూ సుబ్బరాజు చేస్తున్న పనికి విమర్శించలేదు.

అన్నయ్య ఇచ్చిన శుభలేఖ అందుకున్న సరస్వతి, ధనుంజయ్‌లు కూడా ఏమీ మాట్లాడలేకపోయారు. ఏం చేస్తారు? వాళ్ళ బంగారం బాగోలేకపోయినప్పుడు..

సత్యవతి పెళ్లి వైభోగంగా జరిగింది. ఫారిన్ పెళ్ళికొడుకు, మర్యాదలకేం కొదవలేదు. పువ్వుల్లో పెట్టి చూసుకునే అత్తగారు.. అంతకన్నా ఏం కావాలి.

పెళ్లి తంతు పూర్తయింది. పెళ్లికూతురు, పెళ్లికొడుకు గుమ్మాలు దాటేవేళ.. సూర్యం మరదళ్ళు అందరూ చేరి 'హారతి' పడుతూ "ఎవరెవరు? వచ్చారు" అంటూ ఇద్దరినీ పేర్లు చెప్పమన్నారు. సూర్యం చెప్పడం పూర్తయిన తరువాత సత్యవతి వంతు. సిగ్గుపడుతూ చెప్పలేక.. చెప్పలేక చెప్పింది. "నేనూ...సూర్యం బావా వచ్చాం" అంది సిగ్గు పడుతూ!

హాలులో రాకేష్, సత్యవతిల చిన్ననాటి ఫొటో.. పాతదై రంగు మారిపోయి, గుర్తు పట్టలేనట్లుగా తయారైంది. అయినా . ఎన్నో ఏళ్ల జ్ఞాపకంగా, అన్ని ఫొటోలతో పాటు మౌన సాక్షిలా అదీ అక్కడే వుంది.

✦

లిటిల్ స్టార్

ఈ చిన్నదెవరో చెప్పుకోండి ?

ఎంతో...అమాయకంగా నవ్వీ నవ్వనట్టు నవ్వుతున్న ఈ చిన్నారి ఎవరో తెల్సా? ఎక్కడో చూసినట్టనిపిస్తోందా? కానీ చెప్పలేకపోతున్నారా? అయితే క్లూ ఇవ్వాల్సిందే. ఈమె... పరుగుల రాణి. ఏంటీ... ఈ ఒక్క మాటకే తెల్సిపోయిందా? కానీ మీ సమాధానం సరైనదో కాదో తెలియాలంటే 24వ పేజీ పేజీ చూడండి.

మాతృత్వపు ధారకు సోకిన మహమ్మారిపై అలుపెరగని కృషి చేస్తున్న ధన్వంతరి. అమ్మ కోసం... ఎంతో మంది అమ్మల కోసం విదేశాల్లో అపారమైన అవకాశాలను వదులుకొని, సొంత గడ్డపై సేవలు చేస్తున్న వైద్యశిఖామణి. పేరు పక్కన ఎన్నో డిగ్రీలు, పెద్ద పెద్ద డిజిగ్నేషన్స్ ఉన్నా... ప్రవర్తనలో మాత్రం సౌమ్యశీలి. వృత్తి జీవితంలో నిబద్ధత...వ్యక్తిగత జీవితంలో నైతికతకు అత్యంత విలువనిచ్చే వ్యక్తి. ఆయనే... డాక్టర్ పి. రఘురాం. వారు చేస్తున్న వైద్య సేవకు ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా డాక్టర్‌గారి గురించిన ఆసక్తికరమైన విషయాలను వారి మాటల్లోనే తెలుసుకుందాం!

అమ్మకే వైద్యం చేయాల్సి వస్తుందనుకోలా!

మన దేశంలో ఏడాదికి సుమారు లక్షా ముప్ఫైవేల మందికి పైగా రొమ్ముక్యాన్సర్‌కు చికిత్స పొందుతున్నారు. భారతీయ మహిళలకు పొంచిఉన్న క్యాన్సర్లలో మొదటిది గర్భసంచి ముఖ ద్వార క్యాన్సర్. రెండోది రొమ్ము క్యాన్సరే. పట్టణ మహిళల్లో అయితే దీని బారిన పడేవారు మరీ ఎక్కువ. మారుతున్న జీవనశైలి, ఈస్ట్రోజన్ హార్మోన్ల అసమతుల్యత, అనువంశకత అందుకు ప్రధాన కారణాలు. చాలా మంది అవగాహన లేమితోనే ఈ వ్యాధి బారినపడి మరణిస్తున్నారు. రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడం అంటే రెండే రెండు పద్ధతులు. ప్రతి మహిళ ఎవరికి వారు తమ రొమ్ములను పరీక్షించుకోవడం. రెండు నలభై ఏళ్ల దాటిన స్త్రీలు మామోగ్రఫీ చేయించుకోవడం. ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది. మొదటి పద్ధతిపై ప్రతి మహిళలకూ అవగాహన కల్పిస్తే చాలా వరకు ఈ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి రోగి ప్రాణాలు కాపాడవచ్చు. అయితే ఏడేళ్ల క్రితం వరకూ కేవలం రొమ్ము సంబంధింత వ్యాధులకు ప్రత్యేకించి ఆసుపత్రులంటూ మన దేశంలో లేవు. ఆ విషయం నన్ను బాగా తొలచివేసింది.

అమ్మకు రొమ్ముక్యాన్సర్

చిన్నప్పటి నుండి డాక్టర్ కావాలనే కోరిక ఉండేది. అమ్మ ఉషాలక్ష్మి, నాన్న చలపతిరావు ఇద్దరూ వైద్య రంగంలో ప్రముఖులు. వారి దగ్గరకొచ్చే రోగులు...వారి బాధలు...జబ్బు నయమయ్యాక వారి ముఖాల్లో కనిపించే సంతోషం ఇవన్నీ నాలో వైద్యవృత్తి పట్ల ఆసక్తి కలిగించాయి. చిన్నప్పుడు స్నేహితులతో డాక్టరాటలే ఆడుకునేవాడిని. మెడిసిన్‌లో మంచి ర్యాంక్ రావడంతో సిద్ధార్థ మెడికల్ కాలేజ్‌లో సీటు వచ్చింది. వైద్య విద్య అభ్యసిస్తుండగానే సర్జన్‌గా స్థిరపడాలనుకున్నాను. అదే సందర్భంలో ఇతర దేశాల్లోని తొమ్మిది సెంటర్లలో బ్రస్ట్ సర్జికల్ సబ్‌స్పెషాలటీ ట్రైనింగ్ సెంటర్స్ మొదలవుతున్నాయి. అందులో సీటు సంపాదించాలంటే అంతర్జాతీయంగా ఉండే పోటీని ఎదుర్కోవాలి. అనుకున్నట్టుగానే అందులో మంచి ర్యాంకు సంపాదించాను. దాంతో ఇంగ్లాండులోని నార్టింగ్‌హామ్ బ్రస్ట్ సర్జన్ సెంటర్‌లో సీటు వచ్చింది. 1990ల్లో అప్పుడే రొమ్ము ఆపరేషన్ చేసినా చొట్ట పడకుండా చేసే పద్ధతి 'ఆంకోప్లాస్టీ' విధానం వస్తోంది. నేను అందులోనే నిపుణత పొందాను. ఇంగ్లాండులోనే స్థిరపడదాం అనుకున్నాను. అమ్మతో కూడా అదే చెప్పాను. నీ ఇష్టం అన్నారు. వివాహం,పిల్లలు అంతా జీవితం సాఫీగా సాగిపోతుంది. ఒక సారి అమ్మ నన్ను చూడ్డానికి ఇంగ్లాండు వచ్చారు. కొంచెం నలతగా కనిపిస్తే, మామోగ్రఫీ పరీక్ష చేశాను. రొమ్ము క్యాన్సర్ అని తేలింది. అమ్మకు ఎలా ధైర్యం చెప్పాలా అని ఆలోచిస్తుంటే, ఆమే నాకు ఏమీకాదు అని ధైర్యం చెప్పేవారు. అమ్మకే వైద్యం చేయాల్సొస్తుందని ఏప్పుడూ ఊహించలేదు. తొందరగా గుర్తించడం, సరైన సమయంలో వైద్యం అందటంతో అమ్మ త్వరగానే కోలుకున్నారు. భారత్‌లో అప్పటివరకూ రొమ్ము సంబంధిత జబ్బులకు వైద్యం అందించే ప్రత్యేకమైన ఆస్పత్రి అంటూ లేదు. మరొకటి అసలు రొమ్ము క్యాన్సర్ గురించి అవగాహన శూన్యం. కావున మన దేశంలోనే సేవలందించాలనే ఆలోచనను అమ్మతో చెప్పాను. ఆమె చాలా ఆనందించారు. కానీ నీవు రావాలంటే, నీతో పాటు నీ భార్య జయంతి అభిప్రాయం కూడా అవసరం కదా అన్నారు. జయంతి అప్పటికే అక్కడ

వ్యక్తిగతం

- **పాఠశాల విద్య హైదరాబాద్ పబ్లిక్ స్కూలో జరిగింది.**
- **ఇంటర్ సెయింట్ ఆల్ఫన్స్ జూనియర్ కాలేజ్**
- **మెడిసిన్ సిద్ధార్థా మెడికల్ కాలేజ్**
- **ఎమ్ఎస్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కస్తూర్బా మెడికల్ కాలేజ్, మంగళూరు.**
- **డా॥ రఘురాం గారి ప్రతిభను గుర్తించి 2010లో లండన్ సర్జికల్ కాలేజ్ వారు పరీక్ష రాయకుండానే ఎఫ్ఆర్‌సిఎస్ అందించారు.**
- **2015లో ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించింది**

ఇన్‌ఫెర్టిలిటీలో పేరున్న నిపుణురాలు. నాకోసం ఆమె అవన్నీ వదులుకుని నాతో ఇండియా వచ్చేసింది.

ఉషాలక్ష్మి ఫౌండేషన్

కుటుంబమంతా హైదరాబాద్‌కు వచ్చాం. అదే సమయంలో కిమ్స్ ఆస్పత్రి ఛైర్మన్ బొల్లినేని భాస్కరరావుగారు, నీ లక్ష్యానికి మన ఆస్పత్రిని వేదికగా మలుచుకోవచ్చుకదా అన్నారు. అందుకు వాళ్ల రూల్స్ కూడా సవరించి అందులోనే ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజస్ అని అమ్మపేరుతో విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చారు. రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే చాలా వరకూ నివారించే అవకాశం ఉంది. కానీ గుర్తించడం ఎలా. మన దేశంలో మధ్య తరగతి వారే ఎక్కువ. ఖరీదైన పరీక్షలు చేయించుకోలేరు. ప్రజల్లో ఈ వ్యాధిపట్ల అవగాహన కల్పించాలనుంది. కానీ ఎలానో అర్థం కాని పరిస్థితి. అప్పుడు అమ్మ ‘ ఫౌండేషన్ పేరిట నీ ఆలోచనలను కార్యరూపం దాల్చొచ్చు కదా’ అన్నారు. అలా 2009లో అమ్మపేరుతోనే ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ ఏర్పాటైంది. దానికి అమ్మే ఛాంపియన్. సినీ నటి గౌతమి అప్పటికే రొమ్ము క్యాన్సర్ చికిత్స తీసుకొని కోలుకున్నారు. ఆమె మొట్టమొదటి సారి తనకొచ్చిన సమస్య గురించి మన ఫౌండేషన్ ప్రారంభ కార్యక్రమంలోనే చెప్పారు. ప్రముఖ నర్తకి ఆనంద శంకర జయంతి నాదగ్గర చికిత్స తీసుకున్నారు. ఫౌండేషన్ నిర్వహించే ప్రతి అవగాహన కార్యక్రమాల్లో వీరు చురుగ్గా పాల్గొంటారు. బారియన్ పాప్ గ్రూప్ సింగర్ మార్సియా బ్యారెట్, యశో చోప్రా భార్య, షబానా ఆజ్మీ, శోభాడే, పూజా బేడీ వంటి వారు కూడా ఉషాలక్ష్మి ఫౌండేషన్ తరపున రొమ్ము జబ్బులపై అవగాహన కార్యక్రమాల్లో ప్రచారకర్తలుగా వ్యవహరించారు. ఇవి కాక ప్రతి ఏడాది వినూత్న పద్ధతుల్లో ప్రజల్ని చైతన్య పరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాం.. మహిళా సమతా సొసైటీ తరపున 15 జిల్లాల్లో వెయ్యి మంది ఆరోగ్య కార్యకర్తలకు రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే పద్ధతుల గురించి అవగాహన కల్పించాము. భవిష్యత్తులో తెలుగు రాష్ట్రాల్లో రొమ్ముసంబంధిత వ్యాధులను అరికట్టే దిశగా పనిచేయడమే నా కర్తవ్యం. అంతేకాదు దేశంలోనే అత్యున్నత రొమ్ము సంబంధిత వ్యాధుల చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి. రొమ్ము క్యాన్సర్ రహిత రాష్ట్రాలుగా మన తెలుగు రాష్ట్రాలను తీర్చిదిద్దడం నా లక్ష్యం అంటున్నారు డా॥ రఘురాం.

ఆయన ప్రత్యేకతలు

రొమ్ముక్యాన్సర్ రహిత సమాజం కోసం ఆయన చేస్తున్న కృషిలో భాగంగా కొంత మంది మిత్రులతో కలిసి ఇండియన్ బ్రెస్ట్ క్యాన్సర్ సర్జన్స్ అసోసియేషన్ స్థాపించారు. దానికి ప్రస్తుతం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పిన్న వయస్సులోనే వైద్యవృత్తిలో అత్యంత ప్రామాణికంగా గల నాలుగు ఎఫ్ఆర్‌సిఎస్‌లు కలిగిన వ్యక్తి డాక్టర్ రఘురాం గారు మాత్రమే. ఇవేకాక అమెరికన్ మెడికల్ కాలేజ్ ఆఫ్ సర్జన్ నుండి ఫెలోషిప్ అందుకున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని 508 ఏళ్ల చరిత్ర కలిగిన రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్ నుండి 2013లో ప్రతిష్ఠాత్మకమైన ఒవర్సీస్ గోల్డ్ మెడల్ పురస్కారం లభించింది. వారు బయట దేశాల వ్యక్తులకు ఇవ్వడం చాలా అరుదు. అలాంటిది కేవలం రఘురాంగారి ప్రతిభ, వారు చేస్తున్న వైద్య సేవలను గుర్తించి ఈ అవార్డు అందించడం విశేషం. 66వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. “ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది. నా రక్తసంబంధీకులైతే ఎలా చూసుకుంటానో అలానే నా దగ్గరకొచ్చే రోగులపట్ల అంతే శ్రద్ధతో వ్యవహరించడం నా ప్రత్యేకత. అలా ఉండటమే నాకు తృప్తి. రోగులతో ఓపికగా మాట్లాడటం, మనో ధైర్యాన్ని కలిగించడం వంటివాటిపై ఎక్కువ సమయం కేటాయిస్తాను. వారికి మనమిచ్చే మందులకు అవి తోడైతేనే జబ్బును త్వరగా నయం చేయగలమని నా నమ్మకం. ప్రస్తుతం వైద్యులపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. అయితే అలాంటి పరిస్థితి నాకెప్పుడూ ఎదురుకాకూడదని రోజూ ప్రార్థిస్తుంటాను. సాధ్యమైనంత వరకూ నా దగ్గరకు వచ్చే రోగులు సంతోషంతో ఇంటికి వెళ్లాలనే కోరుకుంటాను. నా జీవితంలో నైతిక విలువలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. విలువలే మనిషిగా మనల్ని నిలబెడతాయనేది నా నమ్మకం. అమ్మ, నాన్న కూడా చిన్నప్పటినుండీ నాకదే నేర్పించారు. ఇప్పుడు నా పిల్లలకూ ఆ విషయాన్నే చెబుతుంటా. ప్రస్తుతం నా భార్య వైజయంతి కిమ్స్ ఆస్పత్రిలోనే ఇన్‌ఫెర్టిలిటీ నిపుణురాలుగా పనిచేస్తుంది. మేమిద్దరం వైద్యులం. రోజులో చాలా వరకూ మా జీవితం ఆస్పత్రి, రోగుల మధ్యే గడిచిపోతుంది. అయినా కుటుంబ బాధ్యతల్ని నిర్వర్తించే విధంగానే మా రోజువారీ ప్రణాళిక ఉంటుంది. అమ్మ ఆశీస్సులు, భార్య ప్రోత్సాహమే నన్ను మరింత ముందుకు నడిపిస్తున్నాయన్నది నా విశ్వాసం.

ఇంటర్వ్యూ : కారుసాల అనిత

అమ్మ ఉషా లక్ష్మీ గారితో...

విన్నపం

మన దేశంలో స్త్రీల ఆరోగ్యం పట్ల చాలా నిర్లక్ష్య వైఖరి ఉంది. కొడుకు, భర్త ఎవరైనా సరే పుట్టిన రోజు, పెళ్లిరోజు...పండుగ సందర్భమేదైనా నలభై ఏళ్లు దాటిన మహిళలకు తప్పకుండా మామోగ్రామ్ చేయించడం కానుకగా ఇవ్వండి. దాని వల్ల రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చు. ప్రాణాలు కాపాడవచ్చు. ఆమె ఆరోగ్యం కుటుంబానికి బాసట అనే విషయాన్ని విస్మరించవద్దు.

సినిమా కబుర్లు

సంచలన చిత్ర వజ్రోత్సవం

రోజులు మారాయి

ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నో ఈ పాట వినని తెలుగు వారు వుండరు. అచ్చమైన గ్రామీణ జీవితానికి అద్దం పట్టే ఆ పాట జానపద నృత్యం అరవయ్యేళ్ల కిందట అటు ఆంధ్ర రాష్ట్రాన్ని ఇటు హైదరాబాదునూ కూడా ఉర్రూతలూపాయి. తెలుగు జాతికీ సినిమాకు 'రోజులు మారాయి' అని చాటి చెప్పాయి. అరవయ్యేళ్ల కిందటి ఆ అపురూప చిత్రం పేరూ అదే. నిజానికి అది కేవలం సినిమా పేరు కాదు. ఆనాటి అభ్యుదయ ఉద్యమాల జోరు, ప్రజా కళల హుషారు. 1955లో విడుదలై విజయ దుందుభి మోగించిన 'రోజులు మారాయి' చిత్రం వజ్రోత్సవ సందర్భమిది.

ప్రజా నాట్యమండలి నుంచి ప్రభవించి ప్రజా ఉద్యమాలతో పెనవేసుకుపోయిన కళాకారులు ఔత్సాహికులు అభిరుచి గల నిర్మాణ సారథులతో కలసి రూపొందించిన ఆల్ టైమ్ హిట్ 'రోజులు మారాయి'. సామాజిక చైతన్యం చాటే చిత్రాలకు విజయం వుండదన్నట్టు విపరీత వాదనలు చేసే వారికి నాటికి నేటికీ తిరుగులేని సమాధానం చెప్పిన సినిమా. పల్లె కథలకూ కళలకూ వెండితెర యోగం పట్టించిన సినిమా.

నేపథ్యం...

సినిమాలోకి వెళ్లే ముందు ఒకింత ఫ్లాష్ బాక్.. లేదా బాక్ ఫ్లాష్.. ఏమంటే అదీ అత్యంత రసవంతమే. మహా దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం నలభైలలోనే 'మాలపిల్ల, రైతుబిడ్డ, ఇల్లాలు, గృహలక్ష్మి...' వంటి చిత్రాలు తీసి ప్రజల మహిళల సమస్యలను తెర కెక్కించిన ఘనుడు. ఇక యువ మిత్ర ద్వయం సి.వి.ఆర్.కె.ప్రసాద్, ఎస్.వి.నర్సయ్యలు... కమ్యూనిస్టు ఉద్యమంతో చిరకాల సంబంధం గల యువ సాంకేతిక నిపుణులు. వీరికి దన్నుగా నిలిచిన వ్యక్తి చల్లపల్లి రాజా సోదరుడైన యార్లగడ్డ రామకృష్ణ ప్రసాద్. 'మాలపిల్ల, రైతు బిడ్డ'ల వెనక వున్నది కూడా ఈయనే. కొంతకాలం ఈయన కమ్యూనిస్టు నేతలకు దగ్గరగా వుండేవారు (తర్వాత కాంగ్రెస్ మంత్రిగా చనిపోయారు). సారథీ పిక్చర్స్ (ప్రై) లిమిటెడ్ స్థాపించి తొలి ప్రయత్నంగా తాపీ ధర్మారావు కుమారుడైన తాపీ చాణక్య దర్శకత్వంలో 'అంతా మనవాళ్లే' చిత్రం తీశారు. ఈ చిత్రంలో నాగభూషణం, వల్లం నరసింహరావు, కృష్ణకుమారి తదితరులు నటించారు. మాష్టర్ వేణు సంగీతం సమకూర్చారు. అభ్యుదయ భావాలతో తీసి అభినందనలు పొందినా ఆర్థికంగా పెద్ద విజయం సాధించలేకపోయింది. అయితే ఆ చిత్రం తీసిన ప్రజా కళాకారులు అనేక పాఠాలు నేర్చుకోగలిగారు. లోపాలన్ని సరిచేసుకుని సంధించిన పాశుపతాస్త్రం 'రోజులు మారాయి' సంచలనం కలిగించింది. ఈ చిత్రం ఎంత విజయం సాధించిదంటే ఆ రోజుల్లో కొండమీద నుంచి సాక్షాత్తూ కనకదుర్గ వచ్చి చూసిందని పెద్ద వదంతి బయిలుదేరింది. ఇది నవయుగ సంస్థ మేనేజర్‌గా వున్న కాట్రగడ్డ నరసయ్య ప్రచార వ్యూహంలో భాగమని తర్వాత తేలింది గాని ఆ వూపులో ప్రజలు మాత్రం నిజమనే నమ్మారు. అక్కినేని నాగేశ్వరరావు 43వ చిత్రం కాగా 'షావుకారు' తర్వాత విజయాలు లేని జానకికి మళ్లీ పేరు తెచ్చింది. పెరుమాళ్లు, రేలంగి, సిఎస్ఆర్, రమణారెడ్డి. హేమలత వంటి పలువురు ఉత్తమ నటులకు మంచి ప్రసిద్ధి కల్పించింది. కేవలం 'ఏరువాకా సాగారో...' అనే ఒకే ఒక్క పాటకు చేసిన నృత్యంతో వహీదా రెహమాన్ అఖిల భారత తారాపథంలోకి దూసుకుపోగలిగింది.

పల్లెల్లో యువజన సంఘాలు, పెత్తందార్లపై పోరాటాలు, బాల్య వివాహాలు మూఢనమ్మకాల నిరసన, రైతు ఉద్యమాలు

రాజకీయ ప్రభావం

ఇక్కడ ఒకసారి రాజకీయ రంగంలోకి వెళితే.. ఈ చిత్రం విడుదలకు ముందే 1955 ఫిబ్రవరి-మార్చి నెలల్లో ఆంధ్ర రాష్ట్ర శాసనసభకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. అఖండ విజయం సాధిస్తుందనుకున్న కమ్యూనిస్టు పార్టీ 15 స్థానాలకు పరిమితం కాగా కాంగ్రెస్ కూటమి 146 స్థానాలతో అధికారం కైవశం చేసుకుంది. అయితే ఓడిపోయినా కమ్యూనిస్టులకు 35 శాతంపైగా ఓట్లు వచ్చాయి. ఆ సందర్భంలో కమ్యూనిస్టు భావాలు గల వారు తీసిన చిత్రం ఇంత గొప్ప విజయం సాధించడం అభ్యుదయ వాదులకు నూతనోత్సాహమిచ్చింది. ప్రజల్లో వారు పెనవేసుకున్న తీరును చెప్పింది. ఈ చిత్రంతో సంబంధం వున్నవారిలో అత్యధికులు చివరి వరకూ కమ్యూనిస్టు అభిమానులుగానే వున్నారు. కథ కథనాలతో ఇప్పుడు చూసినా కట్టిపడేసే చిత్రం 'రోజులు మారాయి'.

వంటి వాటిని ఈ చిత్రం అత్యంత సజీవంగా చూపించింది. భూస్వామి సాగరయ్య (సిఎస్ఆర్) అధిక ఉత్పత్తి చేస్తానని ప్రభుత్వం దగ్గర 200 ఎకరాలు తీసుకుని అక్రమంగా కౌలుకు ఇస్తాడు. మధ్య తరగతి రైతు (పెరుమాళ్లు)ను మోసం చేసి అతని పంటలో సగం కబళిస్తాడు. కరణం సాంబయ్య (రమణారెడ్డి) గూండా పోలాయ్ (రేలంగి) సహాయంతో ఇంకా ఎన్నో అక్రమాలు చేస్తుంటే యువజన నాయకుడు వేణు (అక్కినేని) ప్రతిఘటిస్తాడు. చెల్లెలు (అమ్మాజీ–జయచిత్ర తల్లి)ను వృద్ధుడికి ఇచ్చి పెళ్లి చేస్తుంటే అడ్డుకుని గోపాలం (వల్లం)తో వివాహం జరిపిస్తాడు. తను స్వయంగా వూరు వెలివేసిన అమ్మాయిని (జానకి) చేసుకుని ఆదర్శంగా నిలుస్తాడు. రైతు మనస్తత్వం జీర్ణించుకుపోయిన తండ్రి వీటన్నిటినీ విమర్శిస్తున్నా చైతన్యవంతురాలైన తల్లి (హేమలత) పరోక్షంగా ప్రోత్సాహమిస్తుంటుంది. యువజనుల చైతన్యాన్ని తట్టుకోలేని సాగరయ్య కుట్రలను చివరకు అరికట్టడం, బంజర్లు ఆక్రమించడం కథాంశం.

తర్వాత చిత్రాలకు ఇది ఒక వరవడిగా రచన చేసిన వ్యక్తి కొండేపూడి లక్ష్మీనారాయణ. ప్రతి సన్నివేశంలోనూ సంభాషణలోనూ గ్రామీణ వాతావరణం తొణకిసలాడుతుంది. మాటంటే మాటే షూటంటే షూటే వంటి మేనరిజాలను కూడా ఆ రోజుల్లో బాగా పాపులర్ చేశాడు. స్వతహాగా గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన అక్కినేని నటన పల్లెజనాలను బాగా ఆకట్టుకుంది. రోజులు మారాయి తర్వాతి దశలో అక్కినేని ప్రధానంగా కుటుంబ కథా చిత్రాలు ప్రేమకథల్లో నటించారు. పౌరాణికాల్లో వల్లనే ప్రజా నాయకుడుగా ఎన్టీఆర్‌కు ఎక్కువ రాణింపు వుంటుందనే భావన అందుకు ఒక కారణమైంది (తర్వాత కాలంలో కృష్ణ శోభన్ బాబు వంటివారి మధ్యన కూడా ఈ తేడా చూస్తాం). అయితే 'దసరా బుల్లోడు, దత్త పుత్రుడు' వంటి చిత్రాలకు పునాది ఇదే.

అయితే ఇంతకు ముందే చెప్పుకున్నట్టు ఈ చిత్రంలో టాప్ స్కోర్ వహీదాదే. ఆమెను ఈ పాట కోసమే ఏరికోరి వెతికి తెచ్చారు. ఎవరో ఇచ్చిన సమాచారంతో అప్పటి రాజమండ్రి కమిషనర్ కుమార్తెలు వహీదా, షహేదాలను పరీక్షించి ఈమెను ఎంపిక చేశారు. 'ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నో...' అనే డప్పుల పాట, దానికి ఆమె హుషారైన నాట్యం ఎవర్ గ్రీన్‌గా నిల్చిపోయాయి. ఈ పాట కాగానే రెండోసారి మూడోసారి వచ్చిన జనాలు (రిపీట్ ఆడియన్స్) హాల్లోంచి లేచిపోయే వారట. మాష్టర్ వేణు ఈ చిత్రంతో అగ్రశ్రేణి సంగీత దర్శకుడైపోయాడు. 'రోజులు మారాయి' తమిళంలో 'కాలం పోరాచ్చి' పేర అనువాదం చేసినప్పుడు కూడా ఈ పాట అంతే హిట్ అయింది. పైగా అయిదు సినిమాల్లో అలాంటి పాటలే పెట్టుకున్నారు. బాలివుడ్ సంగీత బ్రహ్మ ఎస్.డి.బర్మన్ 'బొంబాయి కా బాబు' చిత్రంలో 'దేఖ్ సే జీ బోలోరో చిన్నన్నో' అంటూ పూర్తిగా ఆ బాణీని దింపేశాడు. చిన్నన్నకు హిందీ పదం దొరకలేదట!

1955 ఏప్రిల్ 14న విడుదలైన 'రోజులు మారాయి' 17 కేంద్రాలలో శత దినోత్సవాలు అనేక చోట్ల రజతోత్సవాలు చూసింది. హైదరాబాదులో రజతోత్సవం జరుపుకొన్న మొదటి తెలుగు సినిమాగా తర్వాత పరిశ్రమ తరలి రావడానికి కారణమైంది. ఆ సభలో తెలంగాణ నేత కె.వి.రంగారెడ్డి తెలుగు సినిమా నిర్మాణం ప్రారంభించాలని కోరడంతో యార్లగడ్డ ప్రసాద్ 1957లో సారథి స్టుడియో నిర్మించారు. ఈచిత్రంతో ముడిపడిన వారంతా తర్వాత మహామహులుగా ఎదిగారు. అప్పటి ఎడిటర్ తిలక్ దర్శక నిర్మాతగా మారారు. నిర్మాణ వ్యవహారాలు చూసిన తమ్మారెడ్డి కృష్ణమూర్తి ప్రముఖ నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. స్టిల్స్ తీసిన గంగాధర్ నవశక్తి ఫిలింస్ స్థాపించి 'మా ఇంటి మహాలక్ష్మి'తో మొదలు పెట్టి చాలా చిత్రాలు తీశారు. రిట్జ్ హెూటల్‌లో చిత్ర విజయోత్సవాలలో వహీదాను చూసిన గురుదత్ ముగ్ధుడైపోయి తన 'ప్యాసా' తదితర చిత్రాలలో ఎన్నో గొప్ప పాత్రలనిచ్చారు. సారథి స్టుడియో తొలి మేనేజర్ ఇప్పుడు ప్రగతి ప్రింటర్స్ పరుచూరి హనుమంతరావు. 1947లో పుచ్చలపల్లి సుందరయ్య ప్రోత్సాహంతో నవయుగ ఫిలింస్ స్థాపించి పంపిణీ వ్యాపారం చేస్తున్న కాట్రగడ్డ శ్రీనివాసరావు 'రోజులు మారాయి' నుంచి సారథి సంస్థలో ప్రవేశించి 1969 నాటికి దాని అధినేత అయ్యారు. సికిందరాబాదులో పంపిణీ సంస్థలు వెలశాయి. ఈ విధంగా చిత్ర విజయం నిజంగానే రోజులు మారడానికి కారణమైంది.

- తె.ర

ప్రదేశం: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్. **సంవత్సరం:** 1984 డిసెంబర్ మాసం. రెండవ తారీకు. **సమయం:** అర్ధరాత్రి.

చలికి బయటకు రావాలంటేనే... ఒకటికి పదిసార్లు ఆలోచింపచేసేలా వుంది వాతావరణం. దాదాపుగా అందరూ నిద్రలోనే వున్నారు. సరిగ్గా అప్పుడు అనూహ్యంగా జరిగిందో ప్రమాదం. స్థానిక యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలోంచి విషపూరిత మిథైల్ – ఐసో సైనేట్ గ్యాస్ విడుదలైంది. అసలేం జరుగుతుందో కూడా తెలియకుండానే ప్రాణాలు కోల్పోయారెందరో! మృతుల సంఖ్య వేలల్లోనే వుంది. దుర్ఘటన జరిగిన కొద్దిసేపట్లోనే ప్రపంచమంతా వ్యాపించిపోయిందా వార్త. ఇది జరిగి ఇప్పటికి ముప్పయ్యేళ్లు. న్యాయం కోసం బాధితులు పోరాడుతూనే వున్నారు. ఆ స్మృతి చిహ్నంగా గత డిసెంబర్ 2వ తేదీన భోపాల్‌లో ఒక మ్యూజియంను ప్రారంభించారు. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీకి 2.5 కిలోమీటర్ల దూరంలోని బరాసియా రోడ్‌లో.

మామూలుగా మ్యూజియం అనగానే సువిశాల పురాతన భవనాలు మనకు జ్ఞప్తికి వస్తాయి. కళాఖండాలు, గత వైభవ చిహ్నాలు అక్కడ దర్శనమిస్తాయి. కానీ అందుకు భిన్నమైనది భోపాల్ మ్యూజియం. ఇందులో ప్రజల కథలు, బాధితుల గాథలు వుంటాయి. వారి భావోద్వేగాలు మ్యూజియంలో కదలాడే గాలిని సైతం కంట తడి పెట్టిస్తాయంటే నమ్మబుద్ధి కాదు. గ్యాస్ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబానికి చెందినదీ ఇల్లు. మ్యూజియంను మూడు భాగాలుగా విభజించారు. ఒకటి బ్లాక్ రూమ్. ఆ చీకటి రాత్రి ... మృత్యువు చేసిన కరాళ నృత్యం తాలూకు చిహ్నాలు... ఫొటోల రూపంలో గోడలకు వేళ్లాడుతుంటాయి. మిగతా రెండు గదుల్లో ఆ రోజు రాత్రి మృతులు వాడిన వస్తువులు దర్శనమిస్తాయి.

నాలుగేళ్ల నిరీక్షణ

2009లో గ్యాస్ దుర్ఘటన మెమోరియల్‌ను ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం భావించాయి. కేంద్ర ప్రభుత్వం పది కోట్ల రూపాయలను కూడా కేటాయించింది. 67 ఎకరాల యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో అనుకున్నారు. అయితే అందుకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మ్యూజియం ఆలోచనకు వ్యతిరేకంగా కేసులు కూడా నమోదయ్యాయి. దాంతో ఆ ఆలోచనను విరమించుకున్నారు.

అయితే ప్రస్తుతం ఏర్పాటయిన మ్యూజియం ఆలోచన, ఆచరణ వెనక వున్నది మాత్రం జర్నలిస్టు రామలక్ష్మి, సామాజిక కార్యకర్త షాలినీ శర్మ. మరే సామాజిక ఉద్యమాన్నయినా సరే ఈ పద్ధతుల్లో మ్యూజియం ఏర్పాటు చేయవచ్చని రామలక్ష్మి అభిప్రాయం. వారి ఆలోచన రూపుదాల్చి కళ్ల ముందు రావడానికి నాలుగేళ్లు పట్టింది. "ఇది మన కథ. భోపాల్ గ్యాస్ దుర్ఘటన బాధితుల ఫొటోలను, వస్తువులను చూసినప్పుడు, వారి బంధువుల గుండెకోత విన్నప్పుడు కన్నీళ్లు పెట్టుకోని వారుండరు. వారి మాటలు, బాధలు... హృదయాలను తాకుతున్నాయనే అధికశాతం సందర్శకులు చెప్తుంటారు" అని మ్యూజియం నిర్వాహకురాలు నస్రీన్ ఖాన్ అంటారు.

కదిలించే కథనాలు చలింపచేసే చిత్రాలు

మనం ఎన్నో మ్యూజియంలు చూసి వుంటాం. కొన్ని మనల్ని ఆశ్చర్యానందాలకు గురిచేసి వుండొచ్చు. మరికొన్ని కరిగిపోయిన కాలంలోకి లాక్కెళ్లి వుండొచ్చు. కానీ ... ఇప్పుడు మనం చెప్పకోబోయే మ్యూజియం మాత్రం ప్రత్యేక తరహాది. బహుశా ఇలాంటిది మరెక్కడా లేదేమో! ఇది సమకాలీన సంఘటనకు సాక్షీభూతంగా నిలుస్తుంది. ముప్పై ఏళ్ల కిందట జరిగిన ఘటన తాలూకు చిత్రాలను, బాధితుల మాటలను, గాథలను కళ్లకు కడుతుంది. అదే 'రిమెంబర్ భోపాల్ మ్యూజియం'.

సెయింట్ లూయిస్ చారిత్రక మ్యూజియంలో పనిచేసిన రామలక్ష్మి కథలు చెప్పే మ్యూజియం గురించి కలలు కంది. "అక్కడ చేసిన పరిశోధన ఫలితంగా మ్యూజియంను ఎలా కాపాడుకోవాలో, వస్తువులను ఎలా ప్రదర్శించాలో, అన్యాయానికి గురైన వారి గాథలను ఎలా వినిపించాలో ఉవ్వెత్తున వచ్చిన నిరసనలను పోరాటాలను పలు రకాల ఘటనలకు సంబంధించిన జ్ఞాపికలను, వస్తువులను, అభిప్రాయాలను ఎలా జనానికి అందించాలో నేర్చుకున్నాను' అంటున్నారు రామలక్ష్మి.

భోపాల్ ఘటన జరిగిన పాతికేళ్లయిన సందర్భంలో జరిగిన పోరాటాలను చూసినప్పుడు ఈ ఆలోచన వచ్చిందామెకు. ఒక చిన్న బస్సులో ఈ జ్ఞాపకాలన్నింటిని అమర్చి దేశవ్యాప్తంగా ప్రదర్శించాలనుకున్నారు. నిధుల కొరత వల్ల ఆ ఆలోచన ఆచరణలోకి రాలేదు. కాని ఈమె షాలిని శర్మను కలిసింది. సాంఘిక ఉద్యమాల్లో డాక్టరేట్ పుచ్చుకున్నారీమె. వారు ఒక బృందంగా ఏర్పడి బాధితులను, మృతుల కుటుంబీకులను కలిసి అభిప్రాయాలు సేకరించారు.

కళ్లు చెమర్చే గాథలు

మామూలుగా మ్యూజియంలో ఏదైనా ఒక వస్తువు చుట్టూ కథ అల్లి ఒక బాక్స్ పెడుతుంటారు. దానికి ఒక క్యాప్షన్ కూడా పెడుతుంటారు. కానీ ఇక్కడ అలా కాదు. ముందు బాధితుల కథనాలు విని... రికార్డు చేశాక... వారికి సంబంధించిన వస్తువులను సేకరించి మ్యూజియంను ఏర్పాటు చేశారు.

ఆ బాధాకర క్షణాల గురించి మృతుల తరపు బంధువుల మాటలను, వస్తువులను కాపాడాల్సిన అవసరం వుందంటారు రామలక్ష్మి. పైగా ఇది ఇప్పటికీ వార్తల్లో వున్న అంశం. బాధితులు నేటికీ న్యాయం కోసం ఎదురు చూస్తూనే వున్నారు. పోరాటం సాగిస్తూనే వున్నారు. ఆ చేదు జ్ఞాపకాల తడి ఇంకా ఆరనే లేదు. మూడు గదుల్లోను ... బాధితుల ఫొటోలు, ఆడియో రికార్డింగులు, వస్తువులు వున్నాయి. ఆగిపోయిన జేబు గడియారం, క్రికెట్ బ్యాట్, చేతి కర్రలు, మంగళసూత్రాలు, స్టెతస్కోపు, చలిబన్నీ, పతకాలు, పెళ్లి చీర, గాజులు, పెన్సిల్ బాక్సు, పాల సీసా, కళ్లజోడు ... ఇలా... ప్రతి వస్తువూ బాధితులకు సంబంధించినదే. ఆయా కుటుంబాల వారు మ్యూజియంకు ఇచ్చినవే. అక్కడ కనిపించే... ప్రతి వస్తువు ఆనాటి దుర్ఘటనను కళ్లకు కడుతుంది. ఆ పక్కనే వున్న రిసీవర్‌లోంచి ... వాళ్ల మాటలు కూడా వినొచ్చు.

మ్యూజియంలోకి అడుగెట్టడంతోటే ... మూడేళ్ల చిన్నారి సాజిద్ వేసుకున్న డ్రస్సు కనిపిస్తుంది. ఇతను కూడా ఆ రాత్రే ప్రాణాలు కోల్పోయాడు. దాని పక్కనే వున్న ఫోన్ రిసీవర్ ఎత్తగానే సాజిద్ తల్లి బిస్మిల్లాబీ మాటలు వినిపిస్తాయి. ఆ భయానక రాత్రి గురించి ఆమె మాటల్లో వినొచ్చు.

దుర్ఘటనకు ముందు రోజు తన భర్త ఇన్యాత్ మహ్మద్ బహూకరించిన చీరను మ్యూజయంకు అందచేసింది బానోబీ. ఆ కాళరాత్రి పొట్టన పెట్టుకున్న వేలాది మందిలో అతనూ ఒకడు. ఆ చీరను ఆమె తర్వాత కట్టనే లేదు.

"ఆరోజు నాకు అకస్మాత్తుగా దగ్గు వచ్చింది. నా కళ్లు మండుతున్నట్టనిపించింది. చుట్టూ శవాలే. ఎవ్వరూ వాటిని తియ్యడం లేదు. చెట్ల ఆకులన్నీ రాలిపోయాయి. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు..." అంటాడు గంగారామ్ (67 సంవత్సరాలు).

మూడేళ్ల సాజిద్ ఆరోజు వేసుకున్న డ్రస్సు మ్యూజియం తొలిభాగంలోనే వుంచారు. పక్కనే వున్న ఫోన్ రిసీవర్ ఎత్తితే ... ఆరోజు జరిగిన ఘోరాన్ని, సాజిద్ తల్లి మాటల్లో వినొచ్చు. "సాజిద్‌ను ఎత్తుకుని ఇంటి నుంచి బయటకు పరుగుతీశాను. గ్యాస్ వల్ల నా కళ్లు విపరీతంగా మంట పుట్టాయి. పిల్లాణ్ణి కాపాడుకోలేకపోయాను...' ఇలా సాగుతాయామె మాటలు. చివరికొచ్చేసరికి ఆమె గొంతు పూడుకుపోయినట్టనిపిస్తుంది.

"మొదట మేం మృత దేహాలను తరలించాం. వరుసలో వుంచి అంకెలు వేశాం. అప్పటి నుంచి వారి పేర్లు పోయి అంకెలతోనే గుర్తించసాగాం. తర్వాత వాటిని స్థానికంగా వైద్య విద్యనభ్యసిస్తున్న ఆఖరి సంవత్సరం విద్యార్థులకు అప్పగించాం" అని డి.కె.సత్పతి చెప్తారు. ఈయన ఫోరెన్సిక్ నిపుణులు. దుర్ఘటన అనంతర ఘటనలకు ప్రత్యక్ష సాక్షి. ✦

విజేతలెవరు?

క్రికెట్... మూడక్షరాల ఆట మాత్రమే కాదు. మూడు రూపాల్లో బ్రిటీష్ పాలిత దేశాల క్రీడాభిమానులను సమ్మోహితులను చేస్తున్న క్రీడ. ఐదురోజుల సాంప్రదాయ టెస్ట్ క్రికెట్, ఒక్క రోజులో ముగిసిపోయే ఇన్‌స్టంట్ వన్డే క్రికెట్, మూడున్నర గంటల్లో అటో ఇటో తేలిపోయే ధూమ్ ధామ్ టీ-20 క్రికెట్... ఇలా మూడు రూపాలలోనూ అలరిస్తున్న ఈ జెంటిల్మన్ గేమ్‌లో 11వ వన్డే ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల సంయుక్త ఆధ్వర్యంలో రంగం సిద్ధమయ్యింది. ఫిబ్రవరి 14 నుంచి మార్చి 29 వరకూ జరిగే ఈ మహా సంరంభాన్ని చూసేముందు నాలుగు దశాబ్దాల వన్డే ప్రపంచకప్ ప్రస్థానం గురించి తెలుసుకుందాం!

చొప్పరపు కృష్ణారావు

క్రికెట్... మన దేశంలో అనధికారిక జాతీయ క్రీడ. ఆంగ్ల పాలకులతో పాటు కామన్వెల్త్ దేశాలలో అడుగుపెట్టి కోట్లాది మంది అభిమానులను ఓలలాడిస్తున్న క్రీడ. కాలానుగుణంగా రూపం మార్చుకొంటూ, నిత్య నూతనంగా ఉంటూ వస్తున్న ఈ పెద్ద మనుషుల క్రీడలో 11వ వన్డే ప్రపంచకప్‌కు 'ట్రాన్స్ టాస్మన్' దేశాలు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాల సంయుక్త ఆతిథ్యంలో తెర లేవనుంది.

ఫిబ్రవరి 14 నుంచి మార్చి వరకూ 44 రోజుల పాటు 49 మ్యాచ్‌లుగా సాగే ఈ ప్రపంచ యుద్ధంలో టెస్ట్ హోదా పొందిన పది అగ్రశ్రేణి జట్లతో పాటు, నాలుగు పసికూన జట్లు ఢీకొనబోతున్నాయి.

క్రికెట్ పుట్టిల్లు ఇంగ్లండ్‌లో 1975లో ప్రారంభమైన వన్డే ప్రపంచకప్ గత నాలుగు దశాబ్దాల కాలంలో అంత ఇంతై అంతింతై అన్నట్లుగా ఎదిగిపోయింది. క్రికెట్ ప్రియుల అభిరుచులకు అనుగుణంగా రంగులు, హంగులు మార్చుకొంటూ ఓ ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

అలా మొదలైంది...

ప్రపంచ ప్రధాన క్రీడలు ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్ బాల్, హాకీల్లో ప్రపంచ పోటీలు జరుగుతున్నా, రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న క్రికెట్లో మాత్రం 1970 దశకం వరకూ ప్రపంచ కప్ అన్న ఆలోచనే రాలేదు. 1960 దశాబ్దం వరకూ క్రికెట్ ఐదు రోజుల సాంప్రదాయ టెస్ట్ క్రికెట్ అన్న భావన మాత్రమే ఉండేది. అయితే క్రికెట్‌కు బద్ధ శత్రువు లాంటి వరుణి దేవుడి పుణ్యమా అంటూ వచ్చిన సరికొత్త రూపం, ఆలోచనే పరిమిత ఓవర్ల వన్డే క్రికెట్.

ప్రపంచంలోనే అతి పెద్ద క్రికెట్ వేదిక మెల్బోర్న్ స్టేడియంలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లు మధ్య 1971లో జరగాల్సిన టెస్ట్ మ్యాచ్ వాన దెబ్బతో పదే పదే అంతరాయం కలగడంతో టికెట్లు కొని భారీ సంఖ్యలో తరలి వచ్చిన అభిమానులను సంతృప్తి పరచడం కోసం సరదాగా ఓ 40 పరిమిత ఓవర్ల మ్యాచ్ నిర్వహించారు. ఆఖరి ఓవర్ వరకూ ఈ మ్యాచ్ పట్టుగా, ఉత్కంఠ భరితంగా సాగి స్టేడియంలోని వేలాది మందిలో ఓ సరికొత్త క్రికెట్‌ను చూసిన భావన కలిగించింది.

ఇలా అనుకోకుండా జరిగిన సరదా సరదా మ్యాచ్ ద్వారా పుట్టుకు వచ్చిన ఆలోచనకు ప్రతిరూపమే వన్డే ప్రపంచ కప్.,

తొలి ప్రపంచ కప్

క్రికెట్ చరిత్రలోనే మొట్టమొదటి ప్రపంచకప్‌ను 1975లో ఇంగ్లండ్ వేదికగా రెండు వారాలపాటు నిర్వహించారు. అప్పటికే టెస్ట్ హోదాపొందిన అరు దేశాల (భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వెస్టిండీస్, పాకిస్తాన్) జట్లతో పాటు అసోసియేట్ జట్లుగా ఉన్న శ్రీలంక, తూర్పు ఆఫ్రికా సైతం తలపడ్డాయి. తెలుపురంగు దుస్తులు, ఎరుపు రంగు బంతితో పంపచకప్ పోటీలను 60 ఓవర్లుగా నిర్వహించారు.

1975నుంచి 1983 వరకూ మొదటి మూడు ప్రపంచకప్ టోర్నీలకూ ఇంగ్లండే వేదికగా నిలిచింది. ఆ తర్వాత భారత ఉప ఖండదేశాలు, ఇంగ్లండ్, ఆఫ్రికా ఖండ దేశాల మీదగా మరోసారి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలకు ప్రపంచ కప్ తరలిచ్చింది. 1992 తర్వాత మరోసారి 'ట్రాన్స్



1983
ప్రపంచకప్‌తో
కపిల్

టాస్మన్' దేశాలు ఆతిథ్యమిచ్చాయి. మొట్టమొదటి ప్రపంచకప్ టోర్నీని 1975లో ఇంగ్లండ్ వేదికగా నిర్వహించారు. 60 పరిమిత ఓవర్లుగా, డేలైట్‌లో తెలుపురంగు దుస్తులు, ఎరుపురంగులతో మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ ప్రారంభ ప్రపంచకప్ కరీబియన్ టీమ్ వెస్టిండీస్ షోగా ముగిసింది.

1979,1983 ప్రంచకప్ టోర్నీలు సైతం క్రికెట్ పుట్టిల్లు ఇంగ్లండ్‌లోనే ప్రుడెన్షియల్ వన్డే ప్రపంచ కప్ పేరుతో కపిల్‌దేవ్ నాయకత్వంలోని భారత్ సంచలన విజయం సాధించడంతో 1987 ప్రంచకప్‌ను భారత ఉపఖండ దేశాలలో నిర్వహించాలని ఐసీసీ నిర్ణయించింది. అంతేకాదు 1983 ప్రపంచకప్ వరకూ 60 ఓవర్లుగా ఉన్న మ్యాచ్‌లను నాలుగో ప్రపంచకప్ నుంచి 50 ఓవర్లుగా కుదించారు.

1992లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరవ ప్రపంచకప్ టోర్నీలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి.

సహజ సిద్ధమైన పగటి వెలుగులో ఎరుపు రంగు బంతి, తెలుపు రంగు దుస్తులతో నిర్వహించే వన్డే మ్యాచ్‌ల స్థానంలో డే నైట్ మ్యాచ్‌లు, రంగు రంగుల దుస్తులు, తెలుపు రంగు బంతితో నిర్వహించే మ్యాచ్‌లు వచ్చాయి. ఆ తర్వాత నుంచి టోర్నీ నియమనిబంధనల్లో మార్పులు చేర్పులు చోటు చేసుకొంటూ వచ్చాయి. పవర్‌ప్లే, బ్యాటింగ్, బౌలింగ్, రెండు తెలుపు రంగు బంతులు, ఫీల్డింగ్ పరిమితులు ఇలాంటివే.

బ్యాట్స్‌మన్ గేమ్

బంతి ఉన్నది బాదటానికే అన్న సిద్ధాంతంమీద వన్డే ప్రపంచకప్ పోటీలను నిర్వహిస్తున్నారు. నిబంధనలన్నీ బ్యాట్స్‌మన్‌కు మాత్రమే అనువుగా ఉండేలా శ్రద్ధ తీసుకోడంతో బౌలర్లు బలిపశువులుగా మారిపోతున్నారు. ఫీల్డర్ నియమ నిబంధనలన్నీ బౌలర్ల చేతులు కట్టి పడేసేలా ఉంటున్నాయన్న విమర్శలు లేకపోలేదు. అదేమంటే స్టేడియాలకు తరలివచ్చే అభిమానులు బౌండ్రీలు, సిక్సర్లు, సెంచరీల కోసం వస్తారుకానీ, వెంటవెంటనే వికెట్లు పడగొట్టే విన్యాసాల కోసం కాదని అంతర్జాతీయ క్రికెట్ మండలి చెబుతోంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో జరిగే ప్రస్తుత ప్రంచకప్ మాత్రం బ్యాట్స్‌మెన్‌తో పాటు బౌలర్లకూ సమానంగా ఉపకరించే అవకాశాలున్నాయి.

ప్రపంచకప్ ట్రోఫీకథ...

వన్డే ప్రపంచ కప్ విజేతలకు ఇచ్చే ట్రోఫీల వెనుక ఆసక్తికరమైన కథే ఉంది. 1975 ప్రారంభ ప్రపంచ కప్ నుంచి 1996 ప్రపంచ కప్ వరకూ టోర్నీ ప్రధాన స్పాన్సర్ పేరుతోనే ట్రోఫీని బహూకరించేవారు. 1975 నుంచి 1983 ప్రపంచ కప్ వరకూ ఇంగ్లండ్‌కు చెందిన ప్రుడెన్షియల్ ఇన్సూరెన్స్ సంస్థ పేరుతో ట్రోఫీ ఇచ్చేవారు. 1987 ప్రపంచ కప్‌లో రిలయన్స్ ట్రోఫీ, 1992లో బెన్సన్ అండ్ హెడ్జెస్ 1996లో విల్స్ ట్రోఫీలను విజేతలకు బహుకరించారు. అయితే 1999 టోర్నీ నుంచి ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ సొంతంగా ఐసీసీ ట్రోఫీ పేరుతో తయారు చేయించి ఇస్తోంది.

లండన్‌కు చెందిన క్రౌన్ జ్యూయలర్స్ సంస్థ ఈ ట్రోఫీకి రూపకల్పన చేసింది. 11 కిలోలు బరువు, 60 సెంటీమీటర్ల ఎత్తు కలిగిన ఈ బంగారపు పూత ట్రోఫీలో గ్లోబ్, క్రికెట్ బంతి ప్రపంచాన్ని స్ఫురింప చేస్తాయి. వెండితో తయారు చేసిన మూడు స్థంభాల క్రికెట్లోని బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌కు ప్రతి రూపంగా కనిపిస్తాయి.

ట్రోఫీ కింద భాగంలో గత పదిసార్లుగా విజయం సాధించిన జట్ల పేర్లను లిఖించారు. మరో పది ప్రపంచకప్ విజేతల (జట్ల) పేర్లను సైతం ఈ ట్రోఫీ దిగువ భాగంలో లిఖించే వీలుంది. అయితే అసలు ట్రోఫీని గల్ఫ్‌లోని ఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఉంచి నమూనా ట్రోఫీలను మాత్రమే విజేతలకు ఇస్తున్నారు.

భారత్ అరుదైన ఘనత

1975 నుంచి 2011 వరకూ జరిగిన ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో ప్రుడెన్షియల్, ఐసీసీ వన్డే ట్రోఫీలు నెగ్గిన ఒకే ఒక్క జట్టుగా భారత్ రికార్డులో చేరింది. మరో వైపు ఐసీసీ వన్డే ట్రోఫీని వరుసగా మూడు సార్లు నెగ్గిన ఏకైక జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది.

ఇప్పటి వరకూ ఆస్ట్రేలియా నాలుగు సార్లు, వెస్టిండీస్, భారత్ రెండుసార్లు చొప్పున, పాకిస్థాన్, శ్రీలంక జట్లు ఒక్కొక్కసారి ప్రపంచకప్ సొంతం చేసుకున్నాయి. టెస్ట్ హోదా పొందిన దేశాలలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఇంగ్లండ్, బంగ్లాదేశ్ జట్లు మాత్రమే ఇప్పటి వరకూ కనీసం ఒక్క సారీ ప్రపంచకప్ విజేతగా నిలువలేకపోయాయి. ఇంగ్లండ్ జట్టు మూడు సార్లు ఫైనల్ చేరినా రన్నర్ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

గ్రూపులు - జట్లు

2015 ప్రపంచకప్‌లో మొత్తం 14 దేశాలు జట్లు రెండు గ్రూపులుగా ఢీ కొట్టుకోనున్నాయి. గ్రూప్ లీగ్ కమ్ నాకౌట్ నిర్వహిస్తున్న ఈ టోర్నీలో టెస్ట్ హోదా పొందిన పది దేశాల జట్లు నేరుగా పాల్గొంటుంటే, అసోసియేట్ సభ్యదేశాల క్వాలిఫైయింగ్ టోర్నీ ద్వారా నాలుగు పసికూన జట్లు బరిలోకి దిగుతున్నాయి.

మొత్తం 14 జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తొలి దశ గ్రూప్ రౌండ్ రాబిన్ లీగ్‌లో పోటీ పడతాయి. ఈ

రోహిత్ శర్మ

డేవిడ్ వార్నర్


మెక్ మిలాన్

బ్రాండెన్

ఏబి డివిలర్స్

మ్యాచ్‌లు ఫిబ్రవరి 14 నుంచి మార్చి 15 వరకూ నెలరోజుల పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలలోని 14 వేదికల్లో నిర్వహిస్తారు.

ఒక్కో గ్రూపులోని ఏడు జట్లు ఆరు ప్రత్యర్థి జట్లతో తలపడతాయి. గ్రూప్ లీగ్ మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు వేరే గ్రూపుల్లో నాలుగు అగ్ర శ్రేణి జట్లతో నాకౌట్ క్వార్టర్ ఫైనల్స్‌లో పోటీ పడతాయి.

మార్చి 18 నుంచి 21 వరకూ క్వార్టర్ ఫైనల్స్, మార్చి 24, 26 తేదీల్లో సెమీ ఫైనల్స్, 29న ఫైనల్స్ నిర్వహిస్తారు.

గ్రూప్-ఏలో నాలుగు సార్లు చాంపియన్ ఆస్ట్రేలియా, రెండు సార్లు రన్నరప్ ఇంగ్లండ్ మాజీ ఛాంపియన్ శ్రీలంక, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్, ఆఫ్ఘనిస్తాన్ తలపడతాయి.

గ్రూపు, బిరౌండ్ రాబిన్‌లీగ్‌లో డిఫెండింగ్ చాంపియన్ టీమిండియా హాట్‌ఫేవరెట్ దక్షిణాఫ్రికా, మాజీ చాంపియన్లు వెస్టిండీస్, పాకిస్థాన్, జింబాబ్వే, ఐర్లాండ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్లు పోటీ పడనున్నాయి.

పాయింట్లు ఇలా...

తొలి దశ గ్రూప్‌లీగ్‌లో నెగ్గిన జట్టుకు రెండు పాయింట్లు, 'టై' లేదా మ్యాచ్ రద్దయితే ఒక్కో పాయింట్ చొప్పున ఇస్తారు. గ్రూప్‌లో అత్యధిక విజయాలు, పాయింట్లు సాధించిన మొదటి నాలుగు జట్లు క్వార్టర్ ఫైనల్స్ చేరతాయి.

గ్రూప్-ఏలో నెంబర్ వన్‌గా నిలిచిన జట్టుతో గ్రూప్-బిలో నాలుగో స్థానం సాధించిన జట్టు పోటీ పడుతుంది. గ్రూప్-ఏలో రెండవ స్థానం సాధించిన జట్టు గ్రూప్-బిలో మూడవ స్థానం సాధించిన జట్టు మధ్య ఢీ ఉంటుంది.

టైటిల్ వేటకు దిగుతున్న మొత్తం 14 జట్లలో ఆస్ట్రేలియా, వెస్టిండీస్, భారత్, పాకిస్తాన్, శ్రీలంక, జట్లకు మాత్రమే ప్రపంచ విజేతగా నిలిచిన అనుభవం ఉంది.

1975,1979 సంవత్సరాలలో కరేబియన్ టీమ్ చాంపియన్ కాగా 1983లోభారత్ విజేతగా నిలిచింది. 1987లో ఆస్ట్రేలియా, 1992 పాకిస్తాన్, 1996లో శ్రీలంక విశ్వవిజేతలుగా రికార్డుకెక్కాయి. 1999, 2003, 2007 ప్రపంచ కప్ టోర్నీలో ఆస్ట్రేలియా వరసగా మూడు ప్రపంచకప్‌లు నెగ్గి చరిత్ర సృష్టించింది.

హాట్ ఫేవరెట్ దక్షిణాఫ్రికా

ఆస్ట్రేలియాలోని ఫాస్ట్, న్యూజిలాండ్‌లోని సీమ్ పిచ్‌లపై జరిగే 2015 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచే సత్తా ఉన్న మొదటి మూడు జట్లలో దక్షిణాఫ్రికా అగ్ర స్థానంలో ఉంటుంది.

బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్... మొత్తం మూడు విభాగాలలోనూ సఫారీ టీమ్ ఎంతో సమతూకంతో, అత్యంత పటిష్టంగా కనిపిస్తోంది. వన్డే క్రికెట్లోనే అత్యంత విధ్వంసకర ఆటగాళ్లు ఏబీ డివిలియర్స్, హషీం ఆమ్లా, డూప్లెసిస్, రూసే, డుమ్నీ, డేల్ స్టెయిన్, పార్నెల్ ఈ జట్టులోనే ఉన్నారు.

2011 ప్రపంచకప్‌తో సచిన్

ఇవీ ప్రపంచకప్ స్టేడియాలు

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో 44 రోజుల పాటు జరిగే 49 మ్యాచ్‌లకు వేదికలుగా నిలిచే మొత్తం 14 స్టేడియాలు:

నగరం	వేదిక	దేశం
పెర్త్	వాకాస్టేడియం	ఆస్ట్రేలియా
అడిలైడ్	అడిలైడ్ ఓవల్	ఆస్ట్రేలియా
మెల్బోర్న్	ఎమ్‌సీజీ	ఆస్ట్రేలియా
హోబర్ట్‌బెల్లీరివ్	టాస్మేనియా	(ఆస్ట్రేలియా)
కాన్‌బెర్రా	మనూకా ఓవల్	ఆస్ట్రేలియా
సిడ్నీ	సిడ్నీ క్రికెట్ స్టేడియం	ఆస్ట్రేలియా
బ్రిస్బేన్	గబ్బా స్టేడియం	ఆస్ట్రేలియా
నేపియర్	మెక్లీన్ పార్క్	న్యూజిలాండ్
అక్లాండ్	ఈడెన్ పార్క్	న్యూజిలాండ్
హామిల్టన్	సెడ్డాన్ పార్క్	న్యూజిలాండ్
నెల్సన్	సాక్స్‌టన్ ఓవల్	న్యూజిలాండ్
క్రైస్ట్ చర్చి	హాగ్లే ఓవల్	న్యూజిలాండ్
వెలింగ్టన్	వెస్ట్‌ప్యాక్ స్టేడియం	న్యూజిలాండ్
డునేడిన్	యూనివర్శిటీ ఓవల్	న్యూజిలాండ్

ఒకే ఒక్కడు సచిన్...

వన్డే ప్రపంచకప్ అనగానే ఇండియన్ క్రికెట్ మాస్ట్రో సచిన్ టెండుల్కర్ పేరు మాత్రమే గుర్తుకు వస్తుంది. సచిన్ లేని ప్రపంచకప్ చరిత్రను ఊహించడం అసాధ్యం ప్రపంచకప్‌లో మాస్టర్ 8 రికార్డులు అలాంటివి మరి.

ఏ క్రికెటరైనా జీవితకాలంలో ఒక్కసారి ప్రపంచకప్ ఆడితే జన్మ ధన్యమైనట్లుగానే భావిస్తాడు. అయితే సచిన్ మాత్రం ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా అర డజను ప్రపంచ కప్పులు ఆడేసి చరిత్ర సృష్టించాడు. కేవలం తనకు మాత్రమే సాధ్యమైన ఎన్నో ప్రపంచ రికార్డుల్లో నిలిచాడు.

- **1975 ప్రారంభ ప్రపంచకప్ నుంచి భారత ఉపఖండ దేశాలు వేదికగా ముగిసిన 2001 టోర్నీ వరకూ పది ప్రపంచకప్ టోర్నీలు జరిగితే, సచిన్ ఆరు ప్రపంచకప్పుల్లో పాల్గొన్నాడు.**
- **1992 బెన్సన్ అండ్ హెడ్జెస్ ప్రపంచకప్‌తో మొదలైన మాస్టర్ ప్రస్థానం 2011 ప్రపంచకప్ వరకూ కొనసాగింది.**
- **అయితే ప్రపంచకప్ చాంపియన్‌గా నిలవటానికి మాత్రం మాస్టర్ లాంటి అసాధారణ ఆటగాడే ఎదురు చూడాల్సి వచ్చింది.**
- **1996, 2003 ప్రపంచకప్ టోర్నీలో సచిన్ అత్యుత్తమంగా రాణించినా భారత్ విజేత కాలేకపోయింది. దక్షిణాఫ్రికా వేదికగా ముగిసిన 2003 ప్రపంచకప్‌లో భారత్ రన్నరుగా నిలిస్తే, మాస్టర్ సచిన్ 'ప్లేయర్ ఆఫ్ ది ప్రపంచకప్' గౌరవం సంపాదించాడు.**
- **సచిన్ మొత్తం ఆరు ప్రపంచకప్ టోర్నీల్లో ఆరు సెంచరీలు, 15 హాఫ్ సెంచరీలతోపాటు 2278 పరుగులు సాధించాడు.**
- **మ్యాచ్‌లు, టోర్నీలు, పరుగులు, సెంచరీలు, హాఫ్ సెంచరీల ప్రపంచ కప్ రికార్డులన్నీ మన సచిన్ పేరుతోనే ఉన్నాయి.**
- **24 సంవత్సరాల సచిన్ క్రికెట్ జీవితంలో 2011 ప్రపంచకప్ విజయం చిరస్మరణీయంగా మిగిలిపోయింది.**

ప్రపంచకప్ విజేతలు

సంవత్సరం	వేదిక	విజేత	ట్రోఫీ
1975	ఇంగ్లండ్	వెస్టిండీస్	ప్రుడెన్షియల్ ప్రపంచకప్
1979	ఇంగ్లండ్	వెస్టిండీస్	ప్రుడెన్షియల్ ప్రపంచకప్
1983	ఇంగ్లండ్	భారత్	ప్రుడెన్షియల్ ప్రపంచకప్
1987	భారత్, పాక్, శ్రీలంక	ఆస్ట్రేలియా	రిలయన్ ప్రపంచకప్
1992	ఆస్ట్రేలియా, న్యూజిలాండ్	పాకిస్తాన్	బెన్సన్-హెడ్జెస్ ప్రపంచకప్
1996	భారత్, పాక్, శ్రీలంక	శ్రీలంక	విల్స్ ప్రపంకప్
1999	ఇంగ్లండ్, వేల్స్, హాలెండ్	ఆస్ట్రేలియా	ఐసీసీ ప్రపంచకప్
2003	దక్షిణాఫ్రికా, కెన్యా, జింబాబ్వే	ఆస్ట్రేలియా	ఐసీసీ ప్రపంచకప్
2007	కరీబియన్ దీవులు	ఆస్ట్రేలియా	ఐసీసీ ప్రపంచకప్
2011	భారత్, బంగ్లాదేశ్, పాక్, శ్రీలంక	భారత్	ఐసీసీ ప్రపంచకప్
2015	ఆస్ట్రేలియా, న్యూజిలాండ్	?	ఐసీసీ ప్రపంచకప్

1992 ప్రపంచ కప్‌లో తొలిసారిగా పాల్గొన్న నాటి నుంచి ఫేవరెట్‌గా పోటీకి దిగడం, కీలక మ్యాచ్‌ల్లో చతికిలబడటం సఫారీ టీమ్‌కు సాంప్రదాయ బలహీనతగా ఉంటూ వస్తోంది. అయితే ఆ లోపాలను అధిగమించే సామర్థ్యం ప్రస్తుతం ఈ జట్టులో కనిపిస్తోంది.

దక్షిణాఫ్రికా తర్వాత టైటిల్ గెలుచుకొనే అవకాశాలున్న జట్టు ఏవంటే ఆస్ట్రేలియా, మాజీ సెమీ ఫైనలిస్ట్ న్యూజిలాండ్ అని మాత్రమే చెప్పాలి.

భారత ఉపఖండ జట్లు శ్రీలంక, పాకిస్తాన్, భారత్, బంగ్లాదేశ్ జట్లు అంచనాలకు చాలా దూరంగా ఉన్నాయి. రెండు సార్లు విజేత వెస్టిండీస్, జింబాబ్వే, పసికూనలు ఆఫ్ఘనిస్తాన్, స్కాట్లాండ్, ఐర్లాండ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్లు 'ఆటలో అరటిపండు' లాంటివే.

అగ్రశ్రేణి జట్లకు తొలిదశ గ్రూప్ లీగ్ నల్లేరు మీద బండిలా సాగినా, నాకౌట్ దశ క్వార్టర్ ఫైనల్స్ నుంచే అసలు, సిసలు పోటీ ప్రారంభం కానుంది.

ప్రపంచకప్-భారత్

ప్రపంచంలోనే అత్యధిక క్రికెట్ అభిమానులున్న దేశం భారత్ ఒక్క మాటలో చెప్పాలంటే భారతీయులకు క్రికెట్ పట్ల వున్న అభిమానం అంతా ఇంతా కాదు. పేరుకు మన దేశంలో హాకీ జాతీయ క్రీడగా ఉన్నా, క్రికెట్ మాత్రమే అనధికారిక జాతీయ క్రీడగా మార్కెట్‌ను ప్రభావితం చేస్తోంది.

ఇక నాలుగు సంవత్సరాలకు ఓసారి జరిగే వన్డే ప్రపంచకప్ చరిత్రలో భారత్‌కు ప్రత్యేక స్థానమే ఉంది. మూడు ప్రపంచకప్ (1987, 1996, 2011) టోర్నీలకు ఆతిథ్యమివ్వడంతోపాటు, ఇప్పటివరకూ జరిగిన మొత్తం 10 ప్రపంచకప్ పోటీల్లోనూ పాల్గొని రెండు సార్లు విన్నర్ (1983, 2011) ఓసారి రన్నర్ (2003) స్థానాల్లో నిలిచింది.

ఇంగ్లండ్ వేదికగా 1975లో జరిగిన ప్రారంభ ప్రపంచకప్ నుంచి భారత్ టెస్ట్ హోదా పొందిన జట్టుగా పాల్గొంటూ వస్తోంది. 1975, 1979 ప్రపంచకప్ పోటీల్లో ఆఫ్ స్పిన్నర్ వెంకట్రాఘవన్ నాయకత్వంలో పాల్గొని దారుణంగా విఫలమైంది.

1975 ప్రపంచకప్ గ్రూప్ లీగ్‌లో ఓ గెలుపు, రెండు పరాజయాలతో నిష్క్రమించిన భారత్, 1979 ప్రపంచకప్‌లో మూడుకు మూడు మ్యాచ్‌లు ఓడి అవమాన భారంతో స్వదేశానికి తిరిగి వచ్చింది. టెస్ట్ హోదాలేని శ్రీలంక లాంటి పసికూన జట్టు చేతిలో భారత్ ఓటమి విమర్శకులకు పని చెప్పింది.

కపిల్ డెవిల్స్ సంచలనం

1983 ప్రుడెన్షియల్ ప్రపంకప్‌లో ఏమాత్రం అంచనాలు లేకుండా కపిల్‌దేవ్ నాయకత్వంలో పోటీకి దిగిన భారత జట్టు విజేతగా నిలిచి చరిత్ర సృష్టించింది. ప్రపంచకప్‌లో పాల్గొనటానికి భారతజట్టు బయలుదేరే ముందు వారి ఖర్చులే దండగ అంటూ విమర్శలు వచ్చాయి. అయితే వన్డే క్రికెట్లో రెండు సార్లు ప్రపంచ విజేత వెస్టిండీస్, మాజీ రన్నరప్ జట్టు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లపై కపిల్‌సేన అంచనాలకు మించి విజయాలు సాధించింది.

జింబాబ్వేతో జరిగిన గ్రూప్‌లీగ్ సమరంలో ఓటమి ఖాయమనుకున్న భారత్‌ను 175 పరుగుల చారిత్రక ఇన్నింగ్స్‌తో కెప్టెన్ కపిల్ దేవ్ గెలిపించిన తీరు కలకాలం గుర్తుండిపోతుంది.

ఇక హాట్ ఫేవరెట్ వెస్టిండీస్‌తో జరిగిన ఫైనల్లో భారత్ ఓటమి ఖాయమనే అందరూ అనుకున్నారు. అయితే కపిల్ డెవిల్స్ మాత్రం కలిసికట్టుగా ఆడి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ప్రపంచకప్ చరిత్రలోనే ఒక అరుదైన, అపూరపమైన విజయంతో భారత్‌ను విశ్వవిజేతగా నిలిపారు. మూడవ ప్రయత్నంలోనే భారత్ సఫలం కావడంతో విశ్లేషకులు, విమర్శకులు ముక్కు మీద వేలేసుకున్నారు.

జీరోల ముద్రతో ప్రపంచకప్‌లో పాల్గొని కపిల్ డెవిల్స్ హీరోలుగా స్వదేశానికి తిరిగిరావడం భారత క్రికెట్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టంగా మిగిలిపోయింది. 1983 తర్వాత భారత్, మరో ప్రపంచకప్‌ను గెలుచుకోవడానికి 2011 వరకూ నిరీక్షించాల్సి వచ్చింది. 1987, 1992, 1996, 1999 ప్రపంచకప్ టోర్నీల్లో భారత్ అంచనాలను అందుకోలేకపోయింది.

ఆఫ్రికా ఖండ దేశాలు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, కెన్యా సంయుక్త అతిథ్యంలో జరిగిన 2003 ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత జట్టు టైటిల్ సమరంలో విఫలమయ్యింది.

కరీబియన్ ద్వీప దేశాలలో జరిగిన 2007 ప్రపంచకప్ తొలిదశ పోటీల్లోనే హేమాహేమీలతో కూడిన భారత జట్టు ఘోరంగా విఫలమయ్యింది.

భారత ఉపఖండ దేశాలు వేదికగా ముగిసిన 2011 ప్రపంచకప్‌లో భారత్ విశ్వరూపమే ప్రదర్శించింది. సిక్సర్ల కింగ్ యువరాజ్ సింగ్ ఓ వైపు క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూనే ఆల్ రౌండర్‌గా భారత్ టైటిల్ విజయంలో ప్రధాన పాత్ర వహించాడు.

మాస్టర్ సచిన్ 24 ఏళ్ళ స్వప్నం, భారత క్రికెట్ 28 సంవత్సరాల ఆకాంక్ష 2011 ప్రపంచకప్ అందుకోవడంతో నెరవేరాయి.

అంతంత మాత్రమే...

2015 ప్రపంచకప్ ప్రారంభానికి ముందే ఆస్ట్రేలియా పేస్, బౌన్సీ పిచ్‌లపై భారత్ సత్తా ఏ పాటిదో తేలిపోయింది. కంగారూ పర్యటనలో టెస్ట్, ట్రై సిరీస్‌ల్లో పాల్గొన్న ధోనీ అండ్ కో కనీసం ఒక్క విజయమూ సాధించలేకపోయారు.

డిఫెండింగ్ చాంపియన్ హోదాలో పోటికి దిగుతున్న భారతజట్టు పూల్-బీలీగ్‌లో హాట్‌ఫేవరెట్ దక్షిణాఫ్రికా, మాజీ విజేతలు పాకిస్తాన్, వెస్టిండీస్ జట్లను అధిగమించి క్వార్టర్ ఫైనల్ నాకౌట్ రౌండ్ చేరినా, ఆ తర్వాత కష్టమే. ఏదైనా అద్భుతం జరిగితే మినహా ప్రస్తుత ప్రపంచకప్‌లో భారత్ విజయావకాశాలు అంతంత మాత్రమే.

గెలుపు, ఓటమి ఆటలో ఓ ప్రధాన భాగం ప్రపంచకము కోసం పోటీపడుతున్న మిగిలిన 13 జట్లూ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ, ప్రతి ప్రపంచకప్‌లోనూ తమ జట్టే విజయం సాధించాలని, విశ్వ విజేతగా నిలవాలని కోరుకోవడం అత్యాశే అవుతుంది. ఆట, సామర్థ్యం వేరు, అంచనాలు వేరు.

మహేంద్రసింగ్ ధోనీ నాయకత్వంలోని భారతజట్టు ఎంత గొప్పగా పోరాడుతుందో చూడాలి. మన జట్టును 'చక్ దే ఇండియా' అంటూ ప్రోత్సహిద్దాం, లక్ దే ఇండియా' అంటూ శుభాకాంక్షలు చెబుదాం! ✦

ప్రేమ... విప్లవం...

(భాగం -23) **మార్క్స్, జెన్నీ ప్రేమ కథ**



మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

మరునాడు మళ్లీ కోర్టుకెళ్లాడు మార్క్స్. దేశద్రోహ నేరానికి 'నో మోర్ టాక్సస్' ప్రచురించినందుకు. ఈసారి అతని వెంట షాపర్, లాయర్ ష్నైడర్ వున్నారు. సుమారు గంటపాటు అనర్గళంగా ప్రసంగించాడు మార్క్స్. పన్నులను ప్రభుత్వ వ్యతిరేక ఆయుధంగా వుపయోగించటం తమ హక్కని వాదన. గత సంవత్సరం జరిగిన విషయాలను కూడా ప్రస్తావించాడు. రాజరికాన్ని, సంపన్న వర్గాలకున్న ప్రత్యేక హక్కుల్ని రద్దు చేయటానికి ప్రయత్నించింది నేషనల్ అసెంబ్లీ. కాని ప్రభుత్వం కుట్ర చేసి అసెంబ్లీని రద్దు చేసింది. "పరిపాలించే ప్రభువులే కౌంటర్ రివల్యూషన్ చేస్తే, విప్లవంతో బదులిచ్చే హక్కు ప్రజలకుంటుంది. ఈ సందర్భంగా చారిత్రక ఆధారాలు కూడా చూపాడు. ఇంగ్లండు ప్రభుత్వానికి పన్నులు కట్టకూడదన్నదే అమెరికా స్వాతంత్ర్య ప్రకటన ముఖ్య ఉద్దేశం. పన్నులు కట్టగూడదన్నది ప్రజల చేతిలో వున్న ఒక విప్లవాస్త్రం. "నిజానికి నేషనల్ అసెంబ్లీకి హక్కులంటూ ఏమీ లేవు. ఏమైనా వుంటే అవి ప్రజలిచ్చినవే. ప్రజల ఆదేశాన్ని ధిక్కరించిన క్షణాన అది తన అస్తిత్వ హక్కునే కోల్పోతుంది. అప్పుడు అధికారం తిరిగి ప్రజల చేతుల్లోకి వస్తుంది". ముద్దాయిల వాదనతో అంగీకరించిన కోర్టు వాళ్లను విడుదల చేసింది. అనేక విషయాలు తమకు తెలియచెప్పినందుకు ప్రధాన న్యాయమూర్తి స్వయంగా మార్క్సుకు కృతజ్ఞతలు చెప్పాడు.

మార్క్సును ఒంటరివాణ్ణి చేసి, అప్రదిష్టపాలు చెయ్యాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు పదేపదే విఫలమవుతున్నాయి. మార్క్స్ పై వచ్చే అభియోగాలను పరిగణనలోకే తీసుకోవటంలేదు. ప్రతిసారీ నిర్దోషి అని తీర్పులిస్తున్నారు. "కోర్టు నిర్ణయాలతో మార్క్స్ భుజాలెగరేసుకు తిరుగుతున్నాడు. తననెవ్వరూ ఏమీ చెయ్యలేరని విర్రవీగుతున్నాడు. విషప్రచారంతో మన వున్నత విలువల్ని నాశనం చేస్తున్నాడు. ఇతన్ని దేశం నుండి బహిష్కరించక తప్పదు" అని కొలోన్ మిలిటరీ అధికారి, రైన్ తాత్కాలిక అధ్యక్షునికో లేఖ రాశాడు. ఆ తర్వాత ఫిబ్రవరి 17 నాడు ఒక అధికారిక ఉత్తర్వు పోలీసు సూపరింటెండెంట్‌కు చేరింది. "క్రితం ఏప్రిల్‌లో కొలోన్‌కు వచ్చిన నాటి నుండీ మార్క్స్ ప్రమాదకరమైన వ్యక్తిగా మారాడు. రోజురోజుకూ పాఠకాదరణ పెంచుకుంటున్న తన పత్రికలో రాజ్యాంగాన్ని, రాజును, ప్రభుత్వంలోని ఉన్నతోద్యోగులను అందర్నీ విమర్శించి, అవమానించి ప్రజల్లో అసంతృప్తి పెంచుతున్నాడు. పరోక్షంగా విప్లవానికి సిద్ధం కమ్మంటున్నాడు.

ఈ బహిష్కరణ ఉత్తర్వుల్ని ఆమోదించిన ప్రష్యన్ ఆంతరంగిక మంత్రి, స్థానిక అధికారులు, తమ విచక్షణ ప్రకారం దాన్ని అమలు చేయాలన్నాడు. మార్క్స్ ప్రవర్తనలో ఏదైనా 'ప్రత్యక్ష కారణం' కనిపిస్తుందేమో, అప్పుడు బహిష్కరించవచ్చునని నిరీక్షించారు అధికారులు.

నిజానికి, బహిష్కరింపబడిన యితర వ్యక్తులతో పోల్చితే, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలలో మార్క్స్ పాత్ర ఎక్కువ. అయినా, అధికారులు చర్యలు తీసుకోవటంలో

"మార్క్స్ రెండువారాలపాటు హాంబర్గ్‌లో ఒక ఖరీదైన ఫస్ట్‌క్లాస్ హోటల్లో వున్నాడు (ఈ ఖర్చులు మరెవరో భరించారు). ప్రయాణాలలో అతను యింత విలాసవంతంగా గడపటం, శత్రువులకు వేలెత్తి చూపే అవకాశం కల్పించింది. పేదవాళ్ల తరపున పోరాడే మార్క్స్ సుఖజీవితాన్ని యిష్టపడతాడన్నది అతని మీద అభియోగం. కాని, నిజానికి ఈ ఆరోపణ సత్యదూరం. ఆయనెప్పుడూ ఎవరూ సుఖపడకూడదని చెప్పలేదు. కష్టించి, సంపాదించి అనుభవించమన్నాడు. తన సుఖం కోసం మరొకర్ని దోచుకోవద్దన్నాడు. ధనవంతులతో కలసి కూర్చోవటం, వాళ్ల ప్రవర్తనను పరిశీలించటంలో ఆయన తుంటరి ఆనందం అనుభవించాడు."

ఉపేక్ష వహించారు. దీనికి కారణం జెన్నీకి తన సోదరునితో (ఫెర్డినాండ్) వున్న సాన్నిహిత్యం కావచ్చు. ఇప్పుడతడు సిలీషియన్ నగరం లైగ్నిట్జ్ జిల్లా అధికారి. మార్క్స్ మీద చర్యలు తీసుకోవాల్సిన ఉద్యోగులు ఆయన ఆధ్వర్యంలో పనిచేస్తారు. గత కొద్ది నెలలుగా అతడు రాజుగారు, ప్రధానమంత్రి, యువరాజు విల్హెం యితర అత్యున్నతస్థాయి వ్యక్తులతో స్నేహం పెంచుకున్నాడు. మొత్తం మీద, కారణమేదైనా కొలోన్‌లో మరికొంత కాలం వున్నాడు మార్క్స్. అతడి మీద నిఘా కొనసాగింది. పత్రికకు వచ్చే హేట్ మెయిల్ పెరిగింది. ఒకనాడు యిద్దరు నాన్ కమిషన్ ఆఫీసర్లు ఆయుధాలతో వచ్చి, 'సైనిక సామగ్రిని ఒక అధికారి విక్రయిస్తున్నాడని' రాసినందుకు ప్రతీకారం వుంటుందన్నారు. "ఇది ప్రష్యన్ సైనికులను అవమానించడమే". ఆ వార్త ప్రచురించిన వ్యక్తిని వెంటనే తమకు అప్పగించకపోతే, తమ వాళ్లు ఎంతకైనా తెగిస్తారన్నారు. ఏమాత్రం బెదరకుండా ప్రశాంతంగా, చిరునవ్వుతో, "వాళ్లు తనపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చనీ, బెదిరింపుల వల్ల ప్రయోజనం వుండదనీ తేల్చి చెప్పాడు మార్క్స్. ఆ తర్వాత, తన జేబులో వున్న రివాల్వర్ వాళ్లకు కనిపించేటట్టుగా నిల్చున్నాడు. తుపాకీకి, తుపాకీ సమాధానం. మరోమాట లేకుండా వెళ్లిపోయారు ఆఫీసర్లు.

గురిచూసి కాల్చటం ట్రేయర్‌లోనే నేర్చుకున్నాడు మార్క్స్. అయితే, ఎప్పుడూ మరో మనిషి మీద కాల్పులు జరిపిన దాఖలాలు లేవు. అతడు తన జీవితాన్ని, అంటే కృషిని ప్రేమించాడు. అంత విలువైన జీవితాన్ని ఒక పందెంలో, డ్యూయెల్‌లో పోగొట్టుకోవటమంత

"గడువు దగ్గరపడటంతో చివరి ఎడిషన్‌కు సన్నాహాలు చేసుకున్నాడు మార్క్స్. 1849, మే 19 నాడు వెలువడిన చివరి ఎడిషన్‌లో కూడా రాజీపడలేదు. "మాకు జాలిలేదు. మా మీద జాలి చూపమని మిమ్మల్ని అడగం. అవకాశం వచ్చినప్పుడు మా 'టెరర్'ను ప్రదర్శిస్తాం. అందుకు సంజాయిషీ ఇవ్వం". పత్రిక సంపాదకవర్గం వీడ్కోలు సమావేశంలో పాఠకులకు కృతజ్ఞతలు తెలిపారు. మా నినాదం ఒక్కటే "కార్మికవర్గ విముక్తి" అని ప్రకటించారు. మొదటి పేజీ నుండి చివరి పేజీ దాకా పత్రిక మొత్తం ఎర్ర సిరాతో అచ్చువేశారు. ఇరవైవేల ప్రతులు అమ్ముడుపోయింది."

బకూనిన్

మూర్ఖమైన పని మరొకటుండదు. హింసా మార్గాన్ని ప్రచారం చేసినప్పటికీ, వ్యక్తిగత హింస మనం చేయదలచుకున్న లక్ష్యానికి అడ్డుతగులుతుందని నమ్మాడు. ఉద్రిక్తతలు తగ్గి, తన కుటుంబానికేమి ప్రమాదం లేదనుకున్నప్పుడు ఇంటికి వచ్చిన యిద్దరు ఆగంతకులమీద దోపిడీ దొంగలని కేసుపెట్టాడు. "కొత్త చట్టాల ప్రకారం సైనికుల అధికారాలు పౌరుల ఇళ్లకు కూడా విస్తరిస్తాయా?"

నెలలు తరబడి చర్చలు జరిపిన ఫ్రాంక్‌ఫర్ట్ నేషనల్ అసెంబ్లీ, 1849 మార్చి నెల చివరిన జర్మన్ సమాఖ్యను ఒక దేశంగా ప్రకటించటానికి అవసరమైన రాజ్యాంగాన్ని రూపొందించింది. కాని, యితర జర్మన్ రాకుమారులు అంగీకరించకపోవచ్చుననే సందేహంతో ప్రష్యన్ రాజు దాన్ని తిరస్కరించాడు. ఇదివరలో కూడా ఒకసారి బెర్లిన్‌లో చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కారు. ఇప్పుడు మళ్లీ అసెంబ్లీ ప్రతిపాదనలను తిరస్కరించాడు. రాజ్యాంగానికి సుముఖంగా వున్న జర్మన్ రాష్ట్రాల్లోని మధ్యతరగతిలో నిరసన పెరిగి తిరుగుబాటు అనివార్యమనిపించింది. ఈ కల్లోల వాతావరణంలో జర్మనీలోని పరిస్థితిని అంచనా వెయ్యటానికి, పత్రిక కోసం డబ్బులు పోగు చెయ్యటానికి, కార్మికులతో సంబంధాలు పెంచుకోవటానికీ బయల్దేరాడు మార్క్స్. కొలోన్‌లో వుంటున్న తన కుటుంబ బాధ్యతను ఎంగెల్స్‌కు అప్పగించాడు.

ప్రయాణానికి ముందురోజు కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాడు మార్క్స్. తన బూర్జువా ప్రజాస్వామిక సహచరులతో పూర్తిగా తెగదెంపులు చేసుకున్నాడు. వీళ్లను సమర్థించినందుకు మొదట విమర్శలెదుర్కున్నాడు. కాని కార్మికుల పక్షమే వుంటామని ప్రకటించిన డెమోక్రాట్లు, ప్రతిసారీ సొంత రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం వాళ్లకు ద్రోహం చేశారు. రైన్‌లాండ్ డెమోక్రటిక్ యూనియన్‌తో అన్ని సంబంధాలూ తెంచుకోవటానికి అదీ కారణం. మార్క్స్ తాను పూర్తిగా కార్మికవర్గంతో మమేకమైనానని స్పష్టం చేసిన చర్య ఇదేనన్నారు ఆయన జీవిత చరిత్ర రాసిన బోరిస్ నికొలెవెస్కీ, ఆటో మెంచెన్, హెల్ఫెన్‌లు. ఆ తర్వాత మరెప్పుడూ బూర్జువాలతో ఎలాంటి సంబంధాలూ పెట్టుకోలేదు మార్క్స్.

కొలోన్ నుండి మూడు వారాలపాటు దూరంగా వున్నాడు. అంతక్రితమే, మధ్యతరగతి (బూర్జువాల)తో సంబంధాలు తెంచుకుంటానన్న మార్క్స్ రెండువారాలపాటు హాంబర్గ్‌లో ఒక ఖరీదైన ఫస్ట్‌క్లాస్ హోటల్లో వున్నాడు (ఈ ఖర్చులు మరెవరో భరించారు). ప్రయాణాలలో అతను యింత విలాసవంతంగా గడపటం, శత్రువులకు వేలెత్తి చూపే అవకాశం కల్గించింది. పేదవాళ్ల తరపున పోరాడే మార్క్స్ సుఖజీవితాన్ని యిష్టపడతాడన్నది అతని మీద అభియోగం. కాని, నిజానికి ఈ ఆరోపణ సత్యదూరం. ఆయనెప్పుడూ ఎవరూ సుఖపడకూడదని చెప్పలేదు. కష్టించి, సంపాదించి అనుభవించమన్నాడు. తన సుఖం కోసం మరొకర్ని దోచుకోవద్దన్నాడు. ధనవంతులతో కలసి కూర్చోవటం, వాళ్ల ప్రవర్తనను పరిశీలించటంలో ఆయన తుంటరి ఆనందం అనుభవించాడు. ఇది గ్రహించని సంపన్నులు ఆయన సాంగత్యాన్ని యిష్టపడ్డారు. అయితే, హాంబర్గ్‌లో ఆయన యిలా లగ్జరీ హోటల్లో వుండటానికి మరో కారణం కూడా వుండవచ్చు. ముష్టివాళ్లను జనం ఎలా చూస్తారో ఆయనకు బాగా తెలుసు. చిల్లర కావాలనుకుంటే చెయ్యి చాపితే సరిపోతుంది. కాని ఎక్కువ డబ్బు కావాలంటే, అసలు డబ్బు అవసరమే లేనట్టుగా ఫోజు పెట్టాలి. కాని మార్క్స్ ఒక రకంగా అడుక్కోవటానికే వచ్చాడు. ఉన్నదంతా ఖర్చు అయిపోయింది. అందులో ఎక్కువ భాగం పత్రికకే. ఇప్పుడు డబ్బు పోగు చెయ్యటానికైతే బయల్దేరాడు గాని ఎవరూ ఏమీ సహాయం చెయ్యలేదు. ఖాళీ చేతులతో తిరిగివెళ్లి, తన హోటల్ ఖర్చులు తీర్చటానికి మళ్లీ అప్పులు చేశాడు.

కొలోన్ చేరేనాటికే మరో దుర్వార్త కూడా తన కోసం నిరీక్షిస్తున్నది. బహిష్కరణ ఆదేశాలు జారీ అయ్యాయి. మే 11 నాడే వాటి మీద సంతకాలు జరిగాయి కాని 16 దాకా అవి ఆయనకందలేదు. జర్మనీలో చెలరేగుతున్న తిరుగుబాట్ల గురించి న్యూరైనిష్ జైటుంగ్‌లో

ప్రచురించిన కథనాలు ఈ ఆదేశాలకు కారణం.

సమైక్య జర్మనీ ప్రతిపాదనను తిరస్కరించిన ప్రష్యన్ రాజుకు వ్యతిరేకంగా పార్లమెంట్ సమీపంలో అల్లర్లు జరిగాయి. డ్రెస్డెన్ నగరంలో వారం రోజులపాటు వీధిపోరాటాలు కొనసాగాయి. రిచర్ వాగ్నర్(ప్రముఖ సంగీతకారుడు) సంగీత కచేరీని (డ్రెస్డెన్ ఆపెరా హోజ్‌లో) వినటానికి వచ్చిన బకూనిన్ అక్కడే వుండి, ఆపెరా హోజ్ దగ్ధమవుతుంటే చూసి ఆనందించాడు. మరోవైపు, ఆయన మిత్రుడు వాగ్నర్ బారికేడ్లకు కాపలావున్నాడు. తామంతా టౌన్‌హాల్లో వున్నప్పుడు, నిరసనకారులు దాన్ని పేల్చివేయాలని కూడా ప్రతిపాదించాడు బకూనిన్ (ఆ తర్వాత నగరం వదిలి పారిపోయాడు).

మార్క్స్, కొలోన్‌కు తిరిగి వచ్చేనాటికే, రైన్ నది లోయలో తిరుగుబాట్లకు పథకాలు రచించాడు ఎంగెల్స్. ఒక యుద్ధాగారం మీద దాడిచేసి కార్మికులు దోచుకున్న ఆయుధాలు రెండు ట్రంకుపెట్టెల నిండా సిద్ధంగా వున్నాయి. ఆ వెంటనే, వాటితో తిరుగుబాట్లలో పాల్గొనటానికి ఎల్బర్‌ఫీల్డ్‌కు వెళ్లిపోయాడు. బారికేడ్లు నిర్మించటంలో సహాయం చేశాడు. ఎల్బర్‌ఫీల్డ్, బార్‌మెన్‌ల మధ్య వంతెన మీద తిరుగుబాటుదార్లకు సూచనలిచ్చాడు. ఈ పనులు చేస్తున్నప్పుడు, అతడి తండ్రి ఎంగెల్స్‌ను గుర్తించాడు. సందేహం లేదు. తిరుగుబాటు ఎగదోయటానికే అక్కడున్నాడు తన కొడుకు.

“ నిజానికి, బహిష్కరింపబడిన యితర వ్యక్తులతో పోల్చితే, ప్రభుత్వ వ్యతిరేకకార్యకలాపాలలో మార్క్స్ పాత్ర ఎక్కువ. అయినా, అధికారులు చర్యలు తీసుకోవటంలో ఉపేక్ష వహించారు. దీనికి కారణం జెన్నీకి తన సోదరునితో (ఫెర్డినాండ్) వున్న సాన్నిహిత్యం కావచ్చు. ఇప్పుడతడు సిలీషియన్ నగరం లైగ్నిట్జ్ జిల్లా అధికారి. మార్క్స్ మీద చర్యలు తీసుకోవాల్సిన ఉద్యోగులు ఆయన ఆధ్వర్యంలో పనిచేస్తారు. గత కొద్ది నెలలుగా అతడు రాజుగారు, ప్రధానమంత్రి, యువరాజు విల్హెం యితర అత్యున్నతస్థాయి వ్యక్తులతో స్నేహం పెంచుకున్నాడు. మొత్తం మీద, కారణమేదైనా కొలోన్‌తో మరికొంత కాలం కొనసాగాడు మార్క్స్. అతడి మీద నిఘా కొనసాగింది. పత్రికకు వచ్చే హేట్ మెయిల్ పెరిగింది. ”

వాగ్నర్

తండ్రీ, కొడుకులు తీవ్రంగా పోట్లాడుకున్నారు. ఈ లోగా, ఎల్బర్‌ఫీల్డ్ తిరుగుబాటు వెనకున్న కొందరు మధ్యతరగతి వాళ్లు, కొలోన్ నుండి వచ్చిన ఈ 'కమ్యూనిస్టు' తమ ఉద్యమాన్ని అవసరానికన్నా ఎక్కువ రాడికల్‌గా మారుస్తున్నాడని ఆందోళన చెందారు. ఇతడిక్కడ వుండటం ఎవరికీ మంచిదికాదు. తక్షణం ఊరు వదిలి వెళ్లమన్నారు. వాళ్ల కోరికను మన్నించినట్టే కనిపించిన ఎంగెల్స్, మరోయిద్దరు సహచరులతో కలసి, ఎల్బర్‌ఫీల్డ్‌కు సమీపంలోని యుద్ధాగారం మీద దాడిచేసి ఆయుధాలు దోచుకొని తిరుగుబాటుదార్లకు అందచేశాడు. ఈ ఘనకార్యంతో అతడి మీద మరో అరెస్టు వారంట్ జారీ అయ్యింది. కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న, ఎల్బర్‌ఫీల్డ్ వదిలేనాటికి సంతోషంగానే వున్నాడు ఎంగెల్స్. 'ఓటమి తథ్యమని తెలిసినా సరే, బెర్లిన్ పౌరులు రాజుకు వ్యతిరేకంగా తిరగబడివుండాల్సింది. కనీసం ఇతర్లకు ప్రతీకారేచ్ఛ అన్నా రగిలించేది. విప్లవ సమయాల్లో ఇలాంటి చర్యలు అత్యవసరం' అని తరువాత న్యూరైనిష్ జైటుంగ్‌లో వాపోయాడు.

తిరుగుబాట్లను రిపోర్టు చెయ్యటానికి పత్రిక సిబ్బంది అదనంగా పనిచేసి స్పెషల్ ఎడిషన్లు తీసుకొచ్చారు. ప్రింటింగ్ మెషీన్ల రొదలోనే గబగబా రాసి కంపోజిటర్లకు అందించారు. చివరికి, పరిణామాల గురించి ఆలోచించకుండా జనాన్ని రాజుకు వ్యతిరేకంగా తిరగబడమని ప్రేరేపించాడు మార్క్స్. ఆ తర్వాత రెండు రోజులకే బహిష్కరణ ఆదేశాలు జారీ అయ్యాయి.

గడువు దగ్గరపడటంతో చివరి ఎడిషన్‌కు సన్నాహాలు చేసుకున్నాడు మార్క్స్. 1849, మే 19 నాడు వెలువడిన చివరి ఎడిషన్‌లో కూడా రాజీపడలేదు. “మాకు జాలిలేదు. మా మీద జాలి చూపమని మిమ్మల్ని అడగం. అవకాశం వచ్చినప్పుడు మా 'టెరర్'ను ప్రదర్శిస్తాం. అందుకు సంజాయిషీ ఇవ్వం”. పత్రిక సంపాదకవర్గం వీడ్కోలు సమావేశంలో పాఠకులకు కృతజ్ఞతలు తెలిపారు. మా నినాదం ఒక్కటే “కార్మికవర్గ విముక్తి” అని ప్రకటించారు. మొదటి పేజీ నుండి చివరి పేజీ దాకా పత్రిక మొత్తం ఎర్ర సిరాతో అచ్చువేశారు. ఇరవైవేల ప్రతులు అమ్ముడుపోయింది. కొందరు పత్రికను పది రెట్లు ఎక్కువ ధరకు అమ్మారు. ఆ ఎడిషన్ ఒక క్లాసిక్. ఒక కలెక్టర్స్ ఐటమ్.

అయితే, యింతటి కీర్తి ప్రతిష్టల వల్ల మార్క్స్‌కు కలిగే ప్రయోజనమేమీ లేదు. అధికారులు తమను బలవంతంగా సరిహద్దులు దాటించటానికి ముందే వస్తువులు సర్దుకుని వెళ్లటానికి సిద్ధమయ్యారు మార్క్స్ దంపతులు. జెన్నీ వద్ద ఇప్పుడు ఖరీదైన వస్తువులేమీ లేవు. ఒక వెండి పళ్లెం తప్ప. పుస్తకాలు ఒక మిత్రునికిచ్చి, ఫర్నిచర్, యితర చిన్న సామాన్లు అమ్మేశారు. పత్రిక ఆస్తులమ్మి అప్పులు తీర్చాడు మార్క్స్.

అప్పటికి వాళ్లమీద యింకా ఇరవై మూడు కేసులున్నాయి. అందువల్ల వీలైనంత త్వరగా వెళ్లిపోవటమే మంచిదన్నారు ఎంగెల్స్. పత్రిక చివరి ఎడిషన్ విడుదలైన వెంటనే మార్క్స్ కుటుంబ సమేతంగా, ఎంగెల్స్‌తో కలిసి రైన్ నదిలో బోటు మీద ఫ్రాంక్ ఫర్ట్‌కు పయనమయ్యాడు. వెండి పళ్లాన్ని తాకట్టు పెట్టిన తర్వాత ఆ డబ్బు తీసుకొని ట్రేయర్‌కు వెళ్లింది జెన్నీ.

ఫ్రాంక్ ఫర్ట్ చేరిన మార్క్స్, ఎంగెల్స్, మరోసారి తిరుగుబాటుకు పిలుపునిచ్చారు. మరికొద్ది రోజులకే, బింగెన్ చేరగానే యిద్దర్నీ అదుపులోకి తీసుకుని, ప్రశ్నించి, తరువాత విడుదల చేసింది సైన్యం. ఇక, ఈ పరిస్థితిలో విడివిడిగా ప్రయాణం చెయ్యటం మంచిదనే నిశ్చయానికి వచ్చి, మార్క్స్, పారిస్‌లో జెన్నీ కోసం నిరీక్షిస్తానన్నారు. తిరుగుబాటులో పాల్గొనటానికి బేడేన్‌కు వెళ్లాడు ఎంగెల్స్. తిరుగుబాటుదార్లు దూకుడుగా, ఎగ్రెసివ్‌గా వుండాలన్నది ఆయన విశ్వాసం. “ఆత్మరక్షణ, తిరుగుబాటుదార్లకు మృత్యువుతో సమానం”.

కాని, నిజానికి తిరుగుబాటు అప్పటికే ముగిసింది. పరాజయం భరతం పడుతున్నాయి సైనికమూకలు. యూరోప్ అంతటా రాజరికాలు సజావుగానే కొనసాగాయి, ఫ్రాన్సులో తప్ప.

సశేషం

▪ ఫోన్: 91776 18708

ప్లాస్టిక్ బ్యాగుల వినియోగంపై విధించిన నిషేధం మన దేశం, రాష్ట్రంలో ఎంత ప్రహసన ప్రాయంగా మారిందో మనం నిత్యం చూస్తున్నదే. మనకు తెలియకుండానే మనం ఎప్పుడైనా ప్లాస్టిక్ బ్యాగ్‌ను వినియోగిస్తే భవిష్యత్ తరాలు మనల్ని ఎలా నిందిస్తాయో ప్రతి ఒక్కరూ ఊహించుకోవాలి.

ప్లాస్టిక్ చెత్త బుట్టగా సముద్రాలు

గత ఆరు దశాబ్దాలలో ప్రపంచంలో ప్లాస్టిక్ ఉత్పత్తి దాదాపు 560 రెట్లు పెరిగి ప్రస్తుతం ఏడాదికి 28 కోట్ల టన్నులకు చేరింది. దానిలో సగానికంటే తక్కువ పునరుత్పత్తికి, లేదా భూమిలో పాతిపెడుతుంటే మిగిలిందంతా సముద్రాలకు చేరుతున్నదన్నది నమ్మలేని నిజం. అది సముద్రజీవులపై తద్వారా ఆహారంపై తీవ్ర పర్యవసానాలకు కారణమౌతోంది. మన శాస్త్రవేత్తలు చెబుతున్నదాని ప్రకారం ఐదు లక్షల కోట్ల వృధా ప్లాస్టిక్ ముక్కలు సముద్రాలపై తేలియాడుతున్నాయి. వాటి బరువు 2,68,940 టన్నులుగా అంచనా.

అమెరికా, ఫ్రాన్స్, చిలీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌కు చెందిన శాస్త్రవేత్తలు 2007 నుంచి 2013 మధ్య 24సార్లు హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంతో సహా ఐదు సముద్రాలపై యాత్రలు చేసి ఒక నివేదిక తయారు చేశారు. సముద్రాలన్నింటిపై 1571 ప్రాంతాలలో పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ చెత్త ఉన్నట్లు కనుగొన్నారు.

నిజానికి ఈ పరిశోధనలో ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో ఎంత మొత్తం చేరాయనేది పూర్తిగా తెలియదు. కనుగొన్నదాని ప్రకారం ప్రపంచ ఉత్పత్తిలో సముద్ర ఉపరితలంపై చేరింది 0.1శాతం అన్నది తక్కువగా వేసిన అంచనా. ఇది కూడా 0.33 ఎంఎం కంటే ఎక్కువ ఉన్న ముక్కలను సేకరించి వేసిన అంచనా.

చిన్న చిన్న ప్లాస్టిక్ ముక్కలు ఎక్కువ హాని కలిగిస్తాయి. వలలకు సైతం దొరకనంత చిన్నవిగా ఉంటాయి. అవి చేపలు, పీతల వంటి జీవుల్లో చేరుతున్నట్లు ప్రయోగశాలల పరీక్షల్లో తేలింది. సముద్రాల్లో చేరుతున్న ప్లాస్టిక్స్‌ను ఎంత మేరకు హానికలిగిస్తాయో వర్గీకరించాల్సి ఉంది. భౌతికంగా జీవజాలానికి ముప్పుతెచ్చేవి కొన్ని, అత్యధికం రసాయనికంగా అవి స్వయంగా లేదా ఇతర విషపూరితమైన వాటిని తమలో ఇముడ్చుకొని కూడా హాని కలిగించేవి ఉన్నాయి.

వృధా ప్లాస్టిక్స్ పర్యావరణాన్ని దెబ్బతీసి కొన్ని జీవులను హతమార్చే అవకాశం ఉంది. జీవ వైవిధ్యంపై 2012లో కెనడాలోని మాంట్రియల్‌లో జరిగిన సభలో పేర్కొన్న దాని ప్రకారం మొత్తంగా తాబేళ్లు,45శాతం సముద్ర క్షీరదాలు, 21శాతం సముద్రాలపై ఆధారపడే పక్షులకు హాని కలిగిస్తాయని అంచనా. అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియాలలో ప్లాస్టిక్స్‌ను ఘన వ్యర్థాలుగా పరిగణించి శుద్ధి చేయాల్సి ఉంది. ప్లాస్టిక్ చెత్త కుప్పలను నిర్వహించటం అన్నది పాతబడిన విధానంగానూ, జంతుజాలానికి తీవ్రమైన హాని కలిగిస్తుందని కనుగొన్నారు.

పాలిస్టర్, ఆక్రిలిక్ వంటి సింథటిక్ వస్త్రాలు, క్లీనింగ్ ఉత్పత్తులలో ఉపయోగించే ప్లాస్టిక్స్‌కూడా మానవాళికి ముప్పు కలిగిస్తున్నాయని తేలింది. మైక్రోప్లాస్టిక్స్‌ను పీల్చటం ద్వారా ఊపిరితిత్తులలో చేరుతున్నాయి. మోకాలి చిప్పలు, పిరుదుల జాయింట్ల దగ్గర ప్లాస్టిక్ పరికరాలను అమర్చటం వలన అవి శరీర కణాల పనితీరుపై ప్రభావం చూపటం, కండరాలను దెబ్బతీయటం వంటి పర్యవసానాలు కలుగుతున్నాయి. ప్లాస్టిక్స్‌లో రసాయనాలంటూ ముద్రవేసి వినియోగించే పదార్థాలలో సగానికిపైగా హానికరమైనవని ఐక్యరాజ్యసమితి పరిశోధకులు వర్గీకరించారు. వాటిలో మనందరకు సుపరిచితమైన పోలీ వినైల్ క్లోరైడ్ అనే పివిసి ఉత్పత్తులు ఉన్నాయి. ఈ రసాయనాలు రక్తంలో చేరి పేరుకు పోతున్నాయి. హార్మోన్ల పనితీరును ప్రభావితం చేస్తున్నాయి. అవి స్వయంగా విషపూరితమైనవేగాక ఇతర వాటిని కూడా తమతో చేర్చుకుంటాయి. పురుగుమందులు, సేంద్రియ కాలుష్యాలైన పోలీక్లోరినేటెడ్ బై ఫినైల్స్ వంటివాటిని ప్లాస్టిక్ వ్యర్థాలలో కనుగొన్నారు.అవి నీటి మడ్డిలో వందరెట్లు, సముద్రపు నీటిలో పదిలక్షల రెట్లు అధికంగా ఉంటున్నట్లు తేలింది.

ఇంతటి ముప్పు కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలు నౌకల ద్వారా సముద్రాల్లో కలవకుండా చూడాలని 1973లోనే ఒప్పందానికి వచ్చినప్పటికీ 1988 చివరినాటికి కూడా పూర్తి నిషేధానికి చట్టాన్ని చేయ లేదు. సముద్రాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను కలపకూడదని 134 దేశాలు అంగీకరించినప్పటికీ 1973 ఒప్పందం తరువాత కలపటం మరింతగా పెరిగింది.

అత్యంత ముప్పు కలిగించే ప్లాస్టిక్స్‌లో పివిసి, పోలీస్టైరెన్, పోలీ అర్థెన్, పోలీ కార్బొనేట్‌ల వాటా మూడోవంతు ఉంటోంది. వాటిని రీ సైకిల్ చేయటం చాలా కష్టంతో కూడుకున్నది. పివిసిని నీటి సరఫరా పైపులు, పోలీస్టైరెన్ ఆహార పాకేజింగ్, పోలీఅర్థెన్‌ను ఫర్నిచర్, పోలీకార్బొనేట్‌ను ఎలక్ట్రానిక్స్, ఆరోగ్య సంరక్షణ మరియు టెక్నాలజీ పరిశ్రమలలో వినియోగిస్తున్నారు. కొన్ని పరిశ్రమలలో పివీసి వినియోగాన్ని ఇప్పటికే నిలిపివేసినప్పటికీ ఇంకా వినియోగిస్తున్నారు. హానికర ప్లాస్టిక్స్ వర్గీకరణ జరిగితే వాటి నిషేధం కోసం పౌరుల నుంచి వత్తిడిని పెంచేందుకు అవకాశం ఉంది. ఇప్పటి మాదిరి ప్లాస్టిక్ వినియోగం కొనసాగితే 2050 నాటికి 33 బిలియన్ టన్నుల ప్లాస్టిక్ అదనంగా భూమిపై చేరుతుంది. దాన్ని భూమి చుట్టూ 800 సార్లు చుట్టవచ్చు. హానిపై వర్గీకరణ చేస్తే కనీసం 4బిలియన్ టన్నులనైనా తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు మొరపెట్టుకుంటున్నారు.

- సత్య

సీతాకోక చిలుక బొమ్మ వేద్దాం

బొమ్మలు వేయాలని ఆశ. కానీ రాదు. ఎలా? అనేవారికోసమే ఈ బొమ్మ. మీకు సున్నా గియ్యడం వస్తే చాలు. సీతాకోకచిలుక బొమ్మ వేసేయొచ్చు. జాగ్రత్తగా చూసి వేసేయండి.
తర్వాత మీకిష్టమైన రంగులు కూడా అద్దేయండే !



ఈ చీమలకు పంచదార కన్నా పండ్లంటేనే ఇష్టం. కానీ మధ్యలో గజిబిజి దారులు బోలెడున్నాయి. సరైన దారి చెప్పండి వాటికి.

ముల్లంగి పాదం

తెల్లటి పాదం. చిత్రకారుడు గీసినట్టు కుదురైన వేళ్లు. భలేగా వుంది కదూ. కాకపోతే ఇది మనిషి కాలు కాదు. ముల్లంగి దుంప. ఏం చేద్దాం దీన్ని ప్రకృతి మాత ఇలా పుట్టించింది మరి. ఇంతకీ ఎక్కడనుకుంటున్నారు? జపాన్‌లో. యుకిహిరో ఐకేచి అనే రైతు పొలంలో ఈ పాదం లాంటి ముల్లంగి కాసింది. దీన్ని చూడ్డానికి జనం తెగ ఎగబడుతున్నారనుకోండి.

ఎన్ని జంతువులున్నాయి ?

ఇది చూడ్డానికి ఒక జంతువులాగే కనిపిస్తోంది కదూ. కానీ ఇక్కడ బోలెడన్ని జంతువులు వున్నాయి. అవేంటో మెల్లగా గుర్తించి వాటి పేర్లు రాసేయండి చకచకా.

పదాల దాగుడు మూతలు

ఈ అక్షరాల పందిరిలో పది పదాలు దాక్కున్నాయి. వాటిని మీరు ఎంత సేపట్లో కనిపెట్టి సున్నా చుట్టేస్తారో చూద్దాం.

N	K	Z	F	L	T	C	P	L	D	W	L
O	L	W	I	E	R	I	F	P	M	A	C
I	E	S	H	D	U	B	I	J	X	G	G
T	V	M	U	K	J	K	E	C	H	N	I
A	A	F	G	N	Q	Q	P	A	I	A	L
C	R	W	A	E	S	P	D	M	C	P	D
A	T	Z	T	M	J	H	M	G	P	H	S
V	V	R	Y	C	I	I	I	J	D	R	U
X	N	G	J	Z	W	L	C	N	K	T	M
P	K	M	V	S	T	J	Y	L	E	R	M
O	K	T	U	G	N	I	P	M	A	C	E
R	P	I	C	N	I	C	W	C	O	C	R

తప్పిపోయిన తమ్ముడు

మనం అనుకుంటాం పిల్లలు మాత్రమే తప్పిపోతారని. కానీ ఇదిగో ఇంత పెద్ద మనిషి తమ్ముడు కూడా తప్పిపోయాడట. తెగ వెతుకుతున్నాడు విచారంగా. అసలు విషయం ఏమంటే అతను అక్కడే వున్నాడు. మీకేమైనా కనిపించాడా! అయితే సున్నా చుట్టేయండి.

జవాబు: బండ రాయిలోనే వున్నాడు. కాకపోతే పుస్తకం తిరగేసి చూడండి.

వరుస చెప్పండి



ఈ బొమ్మల్లో కనిపిస్తున్న అబ్బాయే పండు. కళ్లు మూసుకుని ఈల వేస్కుంటూ ఎలా నడుస్తున్నాడో చూడండి. కాకపోతే పాపం పూల కుండీ తన తల మీద పడింది. ఇంతకీ ఈ నాలుగు బొమ్మలనూ ఏ వరుసలో పెడితే సీన్ పూర్తిగా అర్థమౌతుంది? ఆలోచించి చెప్పండి.

(జవాబు: సి, డి, ఎ, బి)

లేసులెన్ని?

బూట్లు కట్టుకోవాలంటే లేసులుండాలి.
ఇక్కడ రకరకాల లేసులున్నాయి. ఇంతకీ అవి ఎన్ని?





నేనెవరిని?

నేను చిన్నగా వున్నప్పుడు పొడవుగా వుంటాను. పెద్దయ్యాక చిన్నగా అయిపోతాను. ఇంతకీ నేనెవరిని? చెప్పకోండి చూద్దాం.



ఎనిమిది ఆటలేవి?

ఇక్కడ ఎనిమిది ఆట వస్తువులున్నాయి. ఇంతకీ వీటిని ఏ ఆటల్లో ఆడతారో చెప్పకోండి.

ఒక తరం స్వరం - సివి

సాహితీ లోకంలో సి.వి.గా సుపరిచితుడూ సుప్రసిద్ధుడూ అయిన చిత్తజల్లు వరహాలరావు రచనల సంపూర్ణ పునర్ముద్రణలు మీ ముందుకు తీసుకు రావడానికి సంతోషిస్తున్నాం. చాలా కాలంగా ఈ సంకల్పం వున్నా వాస్తవ రూపం దాల్చడానికి సమయం పట్టింది. ఈలోగా – రకరకాల అభివృద్ధి నిరోధక శక్తులూ మత ఛాందసాల దాడి ముదిరిన నేటి పరిస్థితులలో ఈ రచనల ప్రాధాన్యత, ప్రాసంగికత మరింత పెరిగిందన్నది నిజం. భారతీయ తాత్వికత, చరిత్ర, సంప్రదాయం గురించి అదే పనిగా మాట్లాడేవారు అందులోని చార్వాకులు, వేనరాజుల వరవడిని కప్పిపుచ్చుతుంటారు. తప్పుగా చూపిస్తుంటారు. సివి ఆ ధిక్కార స్వరాలపై కేంద్రీకరించి శక్తిమంతమైన కావ్యాలుగా మలచారు.

1970లలో తెలుగు సాహితీలోకంలో సంచలనం కలిగించి ప్రగతిశీల శక్తులకూ హేతువాదులకూ అక్షరాయుధాలు అందించింది సివి కలం. సివి, సి.విజయలక్ష్మి, అరుణశ్రీ వంటి పేర్లతో ఆయన రాసిన వచన కవితలూ, కావ్యాలూ ఆలోచనాపరులను, ప్రధానంగా యువతను గొప్పగా ఉత్తేజపర్చాయి. ఆ రోజుల్లో యువజన, విద్యార్థి సంఘాల సభల్లో సివి సందేశాలు, పుస్తకాలు ప్రగాఢ ప్రభావం ప్రసరించేవి. రాజకీయ, ఆర్థిక, సామాజిక ఆధ్మాత్మిక రంగాలలో రకరకాల వంచకులను ఏకకాలంలో ఎండగట్టడం సివి ప్రత్యేకత. సర్కారీ సత్కార సన్మానాలు గానీ, ప్రాపకాలూ ప్రచారాలూ గానీ, ఆయన కోరుకున్నది లేదు. అలాంటి చాపల్యాలూ కండూతులకు దూరంగా, అధ్యయనం చేస్తూ రచనలందిస్తూ వచ్చారు. ఆయనపై మతోన్మాద శక్తులూ ఛాందసవాదులూ విషపు దాడులు చేసిన సందర్భాలు అనేకం. రకరకాల దోపిడీ, పీడన వంచక శక్తులను చీల్చి చెండాడే తన రచనలు తెచ్చిపెట్టిన దురాగ్రహాలకు తల వంచలేదు. నమ్మినదాన్ని చెప్పారు. నమ్మదగని వాటిపై ధ్వజమెత్తారు. ఈ దేశంలో మార్క్సిస్టు సిద్ధాంతవేత్తలలో అగ్రగణ్యుడైన మాకినేని బసవపున్నయ్య స్వయంగా సివి రచనలను పరామర్శ చేయడంలో మనకు వాటి విశిష్టత స్పష్టమవుతుంది.





సాహిత్యంలో అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం మధ్యకాలం సి.వి కి చెందుతుంది. కేరళలో ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని నిరంకుశంగా కూలదోసిన అనుభవం తర్వాతనే ఆయన 'విషాద భారతం' రాశారు. ఉద్యమాలు పోరాటాల ప్రభావాన్ని 'కారు చీకటిలో కాంతి రేఖ'గా కవిత్వీకరించారు. మితవాదంతోనూ ఉగ్రవాదంతోనూ విడగొట్టుకుంటూ మార్క్సిస్టు మూల సూత్రాలకు కట్టుబడటంలో సివి మౌలిక నిబద్ధత మనకు గోచరిస్తుంది. మార్క్సిస్టు ప్రచురణలు, ప్రజాశక్తి కార్యాలయం, పుస్తకశాలలే సి.వి భావజాల కేంద్రాలుగా విలసిల్లాయి. తన క్రియాశీల సాహిత్య, సామాజిక జీవితంలో అధికభాగం ఆయన అక్కడే తన ఆత్మీయ మిత్రులతో ముచ్చటిస్తూ చైతన్యం పంచారు.

మామూలుగా అగ్రశ్రేణి కవులు సాహిత్యేతర సైద్ధాంతిక రచనలు చేయడం అరుదు. కాని సివి అలాంటి పలు సాధికార చరిత్ర గ్రంథాలు వెలువరించడం మరో విలక్షణత. ప్రపంచంలో ప్రథమ శ్రామికవర్గ రాజ్యమైన 'పారిస్ కమ్యూన్'పై కవిత్వం, సిద్ధాంతం మేళవించి 500 పేజీల బృహత్ కావ్యం తీసుకు రావడం ఆయనకే చెల్లింది. పుచ్చలపల్లి సుందరయ్య, ప్రజా వైద్యుడు డా॥రామచంద్రా రెడ్డి, మహాకవి శ్రీశ్రీ, డి.వి.సుబ్బారావు వంటివారిపై సివి కవితలు చూస్తే విప్లవ కారులపట్ల ఆయనకు ఎంత గౌరవమో తెలుస్తుంది. సమాజంలో విజృంభించిన వికృత ధోరణులపై, అర్థంలేని అంధ విశ్వాసాలపై ఆగ్రహంతో కొన్ని తావుల సివి ఉపయోగించే పదజాలం కొందరికి కష్టం కలిగించినా వాటి వెనక వున్న నిజాయితీ ప్రశ్నించలేనిది. ఉత్తరోత్తరా దళిత కవిత్వం వంటివి ముందుకు వచ్చినపుడు సివి లో వారు తమ తొలి అడుగులు చూసుకోవడం యాదృచ్ఛికం కాదు.

సివి వీటిని రచించిన నాటికంటే ఈనాడు ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తుల ముందు సవాళ్లు మరింత తీవ్రమైనాయి. మతఛాందసం, మార్కెట్ పోకడలు కూడా సంతరించుకుంది. వాటిని ప్రతిఘటించేందుకు ఎలా ఎదుర్కోవాలో తెలుసుకోవడానికి కూడా ఈ రచనలు మనకు కరదీపికలవుతాయి.

- స్నేహ

లిటిల్ స్టార్ జవాబు : పరుగుల రాణి పి.టి.ఉష

పెన్సిల్ వీరుడు

రకరకాల పెన్సిళ్లు. రంగు రంగుల పెన్సిళ్లు. వాటిలో జంతువులు, పక్షుల బొమ్మలూ ... వస్తువుల రూపాలూ ... సుగంధ పరిమళాలు వెదజల్లేవీ వుంటాయి. అంగుళం నుంచి ... 8 అడుగుల మూడు అంగుళాల పొడవాటివీ ఆకట్టుకుంటాయి. 29 సెంటీమీటర్ల వెడల్పున్నవీ కనిపిస్తాయి. నలభయ్యేళ్ల నాటివీ... ప్రపంచ నలుమూలల్లో తయారైనవీ వున్నాయి. ఎలిజబెత్ రాణి వాడిన పెన్సిళ్లూ వున్నాయి. మొత్తం 14,000 పెన్సిళ్లు. అన్నిటినీ వైనంగా చూడాలంటే ఒక రోజంతా వెచ్చించాలి. ఇంతకీ వీటి యజమాని ఎవరనుకున్నారు? పదహారేళ్ల ఢిల్లీ కుర్రాడు తుషార్ లఖన్‌పాల్. తనకు నాలుగేళ్ల వయసప్పటి నుంచే పెన్సిళ్లను సేకరించసాగాడు. ఇప్పటికి నలభై దేశాలకు చెందిన పెన్సిళ్లను సేకరించాడు. తండ్రి పైలెట్ కావడంతో అభిరుచికి అనుగుణంగా పెన్సిళ్లను సొంతం చేసుకొనే అద్భుతావకాశాన్ని అందుకున్నాడు. నాన్న మాత్రమే కాదు! కుటుంబ సభ్యులందరూ కూడా ఆ కుర్రాడి అభిరుచికి తగ్గట్టుగా ప్రోత్సహిస్తుంటారు. అంతర్జాలంలో గంటల తరబడి వెతికి మరీ వెరైటీ పెన్సిళ్లను కొనుక్కుంటాడు. రెండవ ఎలిజబెత్ రాణి ఉపయోగించిన పెన్సిళ్లను 40,000 రూపాయలు వెచ్చించి సొంతం చేసుకున్నాడు. 'నాన్న నాకు చిన్నప్పుడు ఎక్కడెక్కడి నుండో పెన్సిళ్లు తెచ్చి ఇచ్చేవాడు. దాంతో నాకు వాటి మీద ఆసక్తి ఏర్పడింది. నాన్నతో కలసి ఏదైనా ఊరెళితే... అక్కడ కనిపించే కొత్త కొత్త పెన్సిళ్లను కొనిపించుకునే వాడిని. ఆ ఇష్టం ఇప్పటికీ అలాగే వుండిపోయింది....' అంటాడు తుషార్.

ఇన్ని పెన్సిళ్లు పోగేసినందుకు లిమ్కా రికార్డు కూడా సాధించేశాడు. అయితే గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాలన్నది తుషార్ తదుపరి లక్ష్యం.

గుండె గూటిలో...

ప్రేమ..ఇష్క్.. ప్యార్... మొహబ్బత్..లవ్... పదాలు వేరైనా అందించే అర్ధం అటూ ఇటూగా ఒక్కటే. అయినా ఈ ప్రేమ లేనిదెక్కడ? మనసుతో చూసిన ప్రతి చోటా తన ప్రతిరూపం కనిపిస్తుంది. చెట్టు, చేమ...పువ్వు, పురుగు...మట్టి, మాను కావేవీ ప్రేమకు అనర్హం. అందుకు ప్రతిబింబాలే ఈ చిత్రాలు.

నిజంగా ఇవి సృష్టి సిత్రాలే.

సకల కోటి జీవరాశులన్నీ ప్రాణవాయువుపై మనుగడ సాగిస్తున్నాయని అనుకుంటాం. నిజానికి ప్రేమ తత్వమే ప్రాణికోటి జీవాధారం. ప్రేమ అనేది లేకపోతే భూమిపై ఏ జీవి మాత్రం బతకగలదు! అయితే అన్ని జీవుల్లోకీ ఒక్క మనిషి మాత్రమే తమ ప్రేమను విభిన్నంగా వ్యక్తీకరించే అవకాశం ఉంది. అందుకు ఈ గుండె గుర్తునే ప్రేమ చిహ్నంగా ఎందుకు ఎంచుకున్నారో మరి. ప్రేమతత్వమంతా ఈ గుండె గుర్తులోనే ఇమిడి ఉండడం వల్లేనేమో!

మనమంటే కవితలు అల్లో... చిత్రాలు వేసో... గుండెలో దాచుకున్న ప్రేమను ... స్వచ్ఛమైన మనసుతో... నిండు నిజాయితీతో బయటపెడతాం. ప్రేమను వ్యక్తీకరించలేని ప్రాణుల సంగతేంటి? అవి కూడా వాటి ప్రేమను చూపిస్తాయి. ఎలా అంటారా, ఇదిగో ఈ బొమ్మలు చూస్తుంటే అర్ధమవ్వట్లా. నిజమైన ప్రేమ ప్రకృతితో పాటు సజీవం అనడానికి ఇంతకన్నా సాక్ష్యం ఇంకేముంటుంది. ●